


Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 19 | శుక్రవారం 28 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# ముంచెత్తిన వరద



- జాడలేని 1600 మంది, వీరిలో భారతీయులు 288
- దాదాపు 400కు చేరిన మృతుల సంఖ్య
- నేపాల్ అంతటా నెలకొన్న విషాదం
- భూకంపం కాదు..హిమానీ నదం బద్దలవ్వడం వల్లే..
- మరో విపత్తు పొంచి ఉందని చైనా హెచ్చరిక

ఖాట్మాండ్ -- సూర్య వాస్తవం

హిమాలయ దేశం నేపాల్లో బుధవారం సంభవించిన జలప్రళయం పెను విషాదాన్ని నింపింది. తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. ఈ మెరుపు వరదల్లో మృతుల సంఖ్య దాదాపు 400కు చేరుకోగా, 1,600 మందికి పైగా గల్లంతయ్యారు. ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఎక్కడ చూసినా వరద నీరు, పెద్దయెత్తున పేరుకుపోయిన బురద కన్పించింది. నేపాల్లో 826 మంది గల్లంతు కాగా, అందులో వందలాది మంది భారతీయులున్నారు. వారిలో 30 దేశాలకు చెందిన పౌరులు ఉన్నారు. కాగా, ఇదే వరదలకు టిబెట్లో ముగ్గురు మరణించగా,

- మిగతా 2లో..

## కిర్గిస్థాన్‌లో ఎస్‌సీవో సదస్సు..

### - హాజరుకానున్న ప్రధాని మోడీ



హైదరాబాద్- సూర్య వాస్తవం

ఆగష్టు 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు ప్రధాని మోడీ విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కిర్గిస్థాన్‌లో జరిగే ఎస్‌సీవో 2026 సదస్సుకు హాజరవుతారు. సెంట్రల్ ఆసియా దేశాలైన ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లతో ద్వైపాక్షిక, వ్యాపార, వాణిజ్య బంధాలను బలోపేతం చేసేందుకు ఈ పర్యటన ఉపయోగపడనుంది. ఎస్‌సీవో సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ అవుతారని భారత విదేశీ మంత్రిత్వ శాఖ తెలిపింది.



## ప్రధాని రేసులో సీఎం విజయ్!

- మొదిటి స్థానంలో ప్రధాని మోదీ
- రెండో స్థానంలో రాహుల్‌గాంధీ,
- మూడో స్థానంలో తమిళనాడు సీఎం విజయ్
- మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో కీలక విషయాలు

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# అచ్ఛేదిన్ ఎక్కడ?

- ఈ పన్నెండేండ్లలో భారత్‌ది వెనుకబాటే!
- తలసరి ఆదాయంలో వెయ్యి డాలర్ల లోటు
- భావ వ్యక్తీకరణ, మతస్వేచ్ఛలోనూ భారీ క్షీణత
- 'మోడీ పాలన' లేకుంటే దేశం మరింత సంపన్నం
- ప్రజాస్వామ్యం, పౌర స్వేచ్ఛ మెరుగ్గా ఉండేవి
- అమెరికా పరిశోధకుల అధ్యయనంలో కీలక విషయాలు




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

మోడీ పాలనను కేవలం గత ప్రభుత్వాలతో పోల్చడం కాదు.. 'మోడీ లేకపోతే భారత్ ఎలా ఉండేది?' అన్న ప్రశ్నకు సమాధానం వెతికిన అధ్యయనం ఇది. టెక్సాస్ టెక్ యూనివర్సిటీకి చెందిన కెవిన్ గ్రియర్, రాబిన్ గ్రియర్ రూపొందించిన 'వాగ్దానాలు : మోడీ, బీజేపీ పాలనలో గవర్నెన్స్ అండ్ గ్రోత్ ఇన్ ఇండియా' అనే పరిశోధనలో ఆశ్చర్యకరమైన విషయాలను వివరించారు. 2014కు ముందు భారత పరిస్థితులకు దగ్గరగా ఉండే దేశాల సమ్మిళిత నమూ నాను రూపొందించారు. 'సింథటిక్ ఇండియా'తో 2014-2023 మధ్య వాస్తవ భారత్ పనితీరును పోల్చారు. ఫలితం మాత్రం మోడీ ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టింది.

**పదేండ్ల పాలన.. పది సూచీల్లో క్షీణత**

అధ్యయనం ప్రకారం... రాజకీయ అవినీతి, ప్రజాస్వామ్యం, ఉదార ప్రజాస్వామ్యం, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, సంఘటితమయ్యే స్వేచ్ఛ, చట్టం ముందు సమానత్వం, చట్టపరమైన సమాన రక్షణ, కార్యనిర్వాహక వ్యవస్థపై న్యాయపరమైన నియంత్రణలు, శాసన వ్యవస్థ ద్వారా ప్రభుత్వంపై నియంత్రణలు వంటి మొత్తం పది పాలనాపరమైన సూచీల్లో భారత్ పనితీరు గణనీయంగా దిగజారింది. ముఖ్యంగా మత స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, ఉదార ప్రజాస్వామ్యం, చట్టం ముందు సమానత్వం వంటి అంశాల్లో క్షీణత గణనీయంగా కనిపించిందని నివేదిక పేర్కొంది.

**అవినీతిపై పోరాటం ఎక్కడ**

2014 ఎన్నికల సమయంలో అవినీతిని ప్రధాన రాజకీయ అంశంగా మలుచుకున్న బీజేపీ.. అప్పటి కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. అయితే ఈ అధ్యయనం మాత్రం మోడీ పాలనలో రాజకీయ అవినీతి

- మిగతా 2లో..



## మరో 25 ఏండ్ల వరకు లోక్‌సభ స్థానాలు పెంచొద్దు

- - రాష్ట్రాలవారీగా ప్రస్తుత ప్రాతినిధ్యాన్ని అలాగే కొనసాగించండి
- 1/3 మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశ పెట్టండి : ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- మరో 25 ఏండ్ల వరకు లోక్‌సభ స్థానాలు పెంచొద్దురాష్ట్రాలవారీగా ప్రస్తుత ప్రాతినిధ్యాన్ని
- అలాగే కొనసాగించండి
- 1/3 మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రవేశ పెట్టండి :?ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

రాబోయే 25 ఏండ్ల వరకు లోక్‌సభ స్థానాలు పెంచొద్దని రాజ్యసభ ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. ప్రస్తుతం ఉన్న 543 స్థానాల సంఖ్యా బలాన్ని అలాగే కొనసాగించాలని, రాష్ట్రాల వారీగా లోక్‌సభ సీట్ల కేటాయింపు అలాగే కొనసాగించాలని సూచించారు. అంతేకాకుండా 2029 లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 1/3 రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మోడీకి రెండు పేజీల

- మిగతా 2లో..

## నేపాల్ వరదలపై ఏపీ ప్రభుత్వం అప్రమత్తం..

### - ఏపీ వాసులపై ఆరా

అమరావతి- సూర్య వాస్తవం



నేపాల్‌లో భారీ వరదల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. నేపాల్ వరదల్లో ఏపీకి చెందిన వారు ఎవరైనా చిక్కుకున్నారా అనే అంశంపై ప్రభుత్వం సమాచారం సేకరిస్తోంది. విపత్తులో చిక్కుకున్న రాష్ట్ర వాసులను గుర్తించి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ వాసులకు సహాయం అందించే విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు. అలాగే రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, నేపాల్‌లో చిక్కుకున్న బాధిత యాత్రికులకు సహాయ సహకారాలు అందించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నేపాల్‌లో వరదల కారణంగా ఇబ్బందుల్లో ఉన్న ఏపీ వాసులు, వారి కుటుంబ సభ్యులు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించి సమాచారం అందించవచ్చు.

## మీర్ ఆలం చెరువుకు కొత్త హంగులు

- ఫ్యామిలీ టూరిస్టు హబ్‌గా అభివృద్ధి..
- ఆకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి
- గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- సస్పెన్షన్ బ్రిడ్జి, వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్ల అభివృద్ధికి ప్రణాళికలు



హైదరాబాద్ - సూర్య వాస్తవం

చారిత్రక ప్రాధాన్యం కలిగిన మీర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త రూపు, సరి కొత్త హంగులు కల్పించాలని యోచిస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా దీనిని ప్రముఖ పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే మీర్ ఆలం చెరువును గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, మీర్ ఆలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు.

- మిగతా 2లో..

# మరో 25 ఏండ్ల వరకు లోక్‌సభ స్థానాలు పెంచొద్దు

(మొదటిపేజీ తరువాయి)

లేఖ రాశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే ఆస్కారం ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు టీవీ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ లేఖను రాస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. డీలిమిటేషన్ (నియోజక వర్గాల పునర్విభజన) ప్రక్రియపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వ ప్రతిపాదనలను అధ్యయనం చేయడానికి రాజకీయ పార్టీలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు తగినంత సమయం ఇవ్వాలని కోరారు. ఇందుకు సంబంధించి ఈ ఏడాది జూలై 16న ప్రధానికి రాసిన లేఖలోని అంశాలను పున:రుద్ఘాటించారు. డీలిమిటేషన్ విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ వైఖరి స్పష్టంగా ఉందన్నారు.?బుల్డోజ్‌కు ప్రయత్నిచొద్దు?డీలిమిటేషన్ అనేది దేశానికి అత్యంత ప్రాముఖ్యం కలిగిన అంశమని ఖర్గే గుర్తుచేశారు. ఈ విషయంలో అన్ని పక్షాలతో సంప్రదంపులు జరపకుండా ప్రతిపాదనలపై ముందుకు వెళ్లవద్దని సూచించారు. 'డీలిమిటేషన్ పై పార్లమెంట్ లో ఈ ఏడాది ఏప్రిల్ 16, 17 తేదీల్లో మాదిరిగా బుల్డోజ్ చేసే ప్రయత్నాలు చేయొద్దు. ఈ అంశం జనాభా ఆధారంగా లోక్ సభ స్థానాల సరిహద్దులతో ముడిపడిన అంశం' అని ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లారు.?

# ప్రధాని రేసులో సీఎం విజయ్!

**- మొదిటి స్థానంలో ప్రధాని మోదీ**
**- రెండో స్థానంలో రాహుల్‌గాంధీ,**
**- మూడో స్థానంలో తమిళనాడు సీఎం విజయ్**
**- మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో కీలక విషయాలు**

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం:** తమిళనాడులో రెండేళ్ల క్రితం టీవీకే పార్టీని స్థాపించి, అనతికాలంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించి ఈ ఏడాది సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన జోసఫ్ విజయ్ జాతీయ స్థాయిలోనూ అంతే వేగంగా పాపులారిటీ పెంచుకుంటున్నారు. తాజాగా ఇండియా టుడే నిర్వహించిన మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వేలో ఈ విషయం నిర్ధారణ అయింది. తాజా సర్వేలో విజయ్ ప్రధాని రేసులో దేశంలో కీలకమైన నేతల్ని వెనక్కి నెట్టి ఏకంగా మూడో స్థానంలో నిలిచారు. అయితే మొదిటి స్థానంలో ప్రధాని నరేంద్ర మోదీ, రెండో స్థానంలో ఎంపీ రాహుల్‌గాంధీ ఉన్నారని సర్వే స్పష్టం చేసింది. 2029లో జరిగే ఎన్నికల్లో దేశంలో ప్రధానిగా ఎవరు ఉంటే బాగుంటుందనే అంశంపై ఈ సర్వేలో అడిగిన ప్రశ్నకు టీవీకీ అధినేత విజయ్‌కి 9.2 శాతం మంది మద్దతు ఇచ్చారు. ఈ జాబితాలో 48.7 శాతం మద్దతుతో ప్రధాని నరేంద్ర మోదీ, 27.1 శాతం మద్దతుతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆయన కంటే ముందున్నారు. ప్రధాని అభ్యర్థుల జాబితాలో విజయ్.. మమతా బెనర్జీ (2 శాతం ఓట్లు), అఖిలేష్ యాదవ్ (1.7 శాతం ఓట్లు), అభిజీత్ దిప్కే (1.3 శాతం ఓట్లు), అరవింద్ కేజ్రివాల్ (1.2 శాతం ఓట్లు) కంటే ఎంతో ముందున్నారు. ఈ సర్వేలో విజయ్ కేవలం తదుపరి ప్రధానమంత్రి ఎవరనే ప్రశ్నకు మాత్రమే పరిమితం కాలేదు, ప్రతిపక్ష కూటమికి నాయకత్వం వహించడానికి ప్రస్తుత ప్రతిపక్ష నాయకులలో ఎవరు అత్యంత అనుకూలమైనవారు అని అడిగితే విజయ్ 12.2 శాతం ఓట్లతో మరోసారి అగ్రస్థానానికి సమీపంలో నిలిచారు. 29 శాతం ఓట్లతో అగ్రస్థానంలో ఉన్న రాహుల్ గాంధీ తర్వాతి స్థానంలో ఉన్నారు.

# టిడిపి కార్యకర్తకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



**బేతంచర్ల -సూర్య వాస్తవం**
బేతంచర్ల మండలంలోని ఎంబాయి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ నాగ విజయప్ప మరణించడం పట్ల డోన్ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి కోట్ల సుజాతమ్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.విజయప్ప మృతదేహానికి వారి నివాసానికి వెళ్లి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, కుటుంబానికి ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం రేషన్ డీలర్లు నిరసన కార్యక్ర మం చేపట్టారు.రేషన్ డీలర్లు దాదా పీర్,నాగరాజు మాట్లాడుతూ.కిలో బియ్యానికి ఇస్తున్న కమీషన్ ను రూ.3 కు పెంచాలని,సరుకుల పంపిణీలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సూర్య నారాయణకు వినతి పత్రం అందజేశారు.

# ముంచెత్తిన వరద

(మొదటిపేజీ తరువాయి)

558 మంది గల్లంతైనట్టు చైనా సీసీటీవీ వెల్లడించింది. వరదలకు వందలాది ఇండ్లు ధ్వంసమయ్యాయి. వంతెనలు, పలు ప్రాజెక్టులు కూడా నాశనమయ్యాయి. నువాకోట్, రసువా జిల్లాల్లో తీవ్ర నష్టం ఏర్పడింది. డజన్ల వంతెనలు పాడైపోయాయని, 40 కి.మీ మేర రోడ్లు ధ్వంసం అయ్యాయని అధికారులు తెలిపారు.

పలు గ్రామాల్లోని నిరాశ్రయులను సురక్షిత ప్రాంతాలకు, శిబిరాలకు తరలిస్తున్నారు. నేపాల్లోని రసువా జిల్లా దిగువ ప్రాంతాల్లో వరద విధ్వంసమే సృష్టించింది. త్రిశూలి నది నుంచి పోటెత్తిన వరద నీరు, వ్యర్థాలు ఇండ్లు, రోడ్లు, వంతెనలు, హైడ్రోపవర్ ప్రాజెక్టును ముంచెత్తాయి. తిమురే, త్రిశూలి బజార్, బెట్రాపతి ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. బలమైన నీటి ప్రవాహానికి ఒక హెలిప్యాడ్ కూడా కొట్టుకుపోవడంతో సహాయక చర్యలకు ఇబ్బంది ఏర్పడింది. కాగా, చైనాలోని గిరింగ్ పట్టణంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగా, పోర్టు ప్రాంతం మాత్రం ఇంకా అంధకారంలోనే ఉంది. వరద ప్రభావ ప్రాంతాల్లో గాలింపు, సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ధాడింగ్, గోర్ఖా, నువాకోట్, తనహూన్, రసువా, పశ్చిమ నవల్పరాసి ప్రాంతాల నుంచి కూడా ప్రాణనష్టం నమోదైంది.

**హిమానీనదం వల్లే వరదలు**

నేపాల్ హిమాలయ ప్రాంతాన్ని బుధవారం అతలాకుతలం చేసిన ప్రాణాంతక మెరుపు వరదలు, ఎత్తయిన పర్వతాలలో ఒక భారీ హిమానీనదం ముక్కవిరిగి కింద ఉన్న నదీలోయలో కూలిపోవడం వల్ల సంభవించి ఉండవచ్చునని నిపుణులు భావిస్తున్నారు. న్యూయార్క్ టైమ్స్ ఉటంకించిన భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు, హిమానీనద శాస్త్రవేత్తల ప్రాథమిక విశ్లేషణ ప్రకారం ఈ ఘటన ఒక హిమసంపాతం (ఐస్ అవలాంచ్) అని తెలుస్తున్నది. చిత్రాలను అధ్యయనం చేసిన కాల్గరీ విశ్వవిద్యాలయంలోని భూ విజ్ఞాన శాస్త్రవేత్త డేనియల్ షుగర్ ప్రకారం ఉపగ్రహ చిత్రాలు దాదాపు రెండు వేల అడుగుల వెడల్పు గల ఒక హిమానీనదంలోని ఒక భాగం విరిగి సుమారు 17 వేల అడుగుల ఎత్తు నుంచి పడిపోయినట్టు సూచిస్తున్నాయి. దీని కారణంగా పొడిపొడిగా మారిన మంచు, నీరు లెండే ఖోలా నదివైపు, చివరకు నేపాల్-చైనా సరిహద్దు సమీపంలోని భోటేభోషి నదివైపు ప్రవహించాయని వివరించారు.

**28 మంది భారతీయులను రక్షించిన అధికారులు**

నేపాల్ వరదల్లో గల్లంతైన 28 మందిని రక్షించినట్టు భారత ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఇంకా 288 మంది ఆచూకీ తెలియడం లేదని తెలిపింది. భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ రక్షించిన 21 మంది కూడా తమిళనాడుకు చెందిన వారని, వారిని భారత్ రప్పిస్తున్నట్టు తెలిపారు. చైనా వైపున ఉన్న సరిహద్దు ప్రాంతమైన టిబెట్లో కూడా చాలామంది భారతీయులు చిక్కుకుపోయారని, 200 మందికి పైగా సహాయం కోరుతున్నారని, వారిలో 95 మంది ప్రస్తుతం టిబెట్ లోని చిన్న గ్రామమైన దార్చెన్లో ఉన్నారన్నారు. ఆచూకీ దొరక్కుండా పోయిన 288 మందిలో 73 మంది త్రిశూలీలోని పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్నారని, ఈ ప్రాంతాన్ని ఆకస్మిక వరద తీవ్రంగా ప్రభావితం చేసిందన్నారు. కాగా, నేపాల్కు మానవతా సహాయం అందించడానికి రెండు విమానాల్లో సహాయ సామగ్రి పంపినట్టు చెప్పారు.

కాగా, ఆకస్మిక వరదల కారణంగా నేపాల్, టిబెట్ లో 1,500 మందికి పైగా గల్లంతయ్యారని, అందులో 800 మంది విదేశీయులు ఉన్నారని నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖానల్ తెలిపారు. కాగా నేపాల్లో భారీ వరదలు సంభవించ డంతో ఆ దేశంతో సరిహద్దును పంచుకుంటున్న బీహార్ రాష్ట్రంలో అధికారులు అప్రమత్తమయ్యారు. అధికారులు ఎప్పటికప్పుడు వరద మట్టాలను నమోదు చేసుకుంటూ పరిస్థితిని గమనిస్తున్నారు.

**వరద ప్రాంతాల్లో నేపాల్ ప్రధాని పర్యటన**

వరదకు గురైన నువాకోఎట్లో నేపాల్ ప్రధాని బాలేందర్ షా గురువారం రోడ్డు మార్గంలో పర్యటించి నష్టాన్ని ప్రత్యక్షంగా చూశారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు, రక్షణ శాఖ అధికారులు, నేతలతో సమావేశమై చేపట్టాల్సిన సహాయ చర్యల గురించి చర్చించారు. భారత్ పంపిన సహాయ సామగ్రిని తీవ్రంగా వరద ప్రమాదానికి గురైన ప్రాంత వాసుల కోసం హెలికాప్టర్ల ద్వారా టెంట్లు, ఆహారం, నీరు, మందులను విడిచి పంపిణీ చేస్తున్నట్టు నేపాల్ సైనిక ప్రతినిధి రాజారామ్ బసెంట్ తెలిపారు.

**అధిక సంఖ్యలో దక్షిణాది వారు గల్లంతు**

దక్షిణాది నుంచి వెళ్లిన 168 మంది నేపాల్ వరదల బారిన పడ్డారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిన వీరు గల్లంతు లేదా చిక్కుకుపోయినట్టు సమాచారం. కాగా, తమ రాష్ట్రం నుంచి నేపాల్కు 103 మంది కైలాస యాత్రకు బయలుదేరినట్టు తమిళనాడు విద్యా శాఖ మంత్రి రాజ మోహన్ తెలిపారు. అయితే మొత్తం 21 మంది తమిళులను మాత్రమే రక్షించినట్టు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. అలాగే కేరళ నుంచి 53 మంది, కర్ణాటక నుంచి ఐదుగురు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడుగురు ఉన్నారు. అలాగే తెలంగాణలో తమ వారు నేపాల్లో చిక్కుకుపోయారని తెలియజేస్తూ, వారి ఆచూకీ కోసం 70-80 కాల్స్ వచ్చాయని అధికారులు తెలిపారు.

**పొంచి ఉన్న మరో ముప్పు**

నేపాల్లోని ఛోచెస్ ఖోలా, పురేపు సాంగ్పో నదుల సంగమ ప్రాంతం వద్ద ఏర్పడిన ఒక అవరోధ సరస్సు రాబోయే మూడు రోజుల్లో తెగిపోయే ప్రమాదం ఉందని చైనా అధికారులను ఉటంకిస్తూ గ్లోబల్ టైమ్స్ గురువారం నివేదించింది. ఇప్పటికే ఈ సరస్సు ఉదయానికి 2 మిలియన క్యూబిక్ మీటర్ల నీటితో ఇప్పటికే నిండి పొర్లుతున్నదని చైనా జల వనరుల శాఖ వెల్లడించింది. రాబోయే మూడు రోజుల్లో మరో మూడు మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు చేరవచ్చునని, అదే జరిగితే నది పొంగే ప్రమాదముందని పేర్కొంది. కాగా తమ ప్రాంతంలో సంభవించిన వరద విపత్తు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చైనా అధ్యక్షుడుషీ జిన్ పింగ్ తన అత్యున్నత స్థాయి సహాయకుడిని గురువారం ఆ ప్రభావిత ప్రాంతాలకు పం

# అచ్ఛేదిన్ ఎక్కడ?

(మొదటిపేజీ తరువాయి)

సూచీ కూడా గణనీయంగా పెరిగిందని పేర్కొంది. అంటే అవినీతిని నిర్మూలిస్తామని చెప్పిన ప్రభుత్వం.. దానిని సాధించలేకపోయింది.

**ఆర్థిక వ్యవస్థకు తీవ్ర దెబ్బ**

దేశ ఆర్థిక రంగంలోనూ అధ్యయనం ఆసక్తికరమైన అంచనాను ముందుకు తెచ్చింది. 2014కు ముందు భారత ఆర్థిక ప్రస్థానానికి దగ్గరగా ఉన్న దేశాల ఆధారంగా రూపొందించిన 'సింథటిక్ ఇండియా'తో పోల్చితే.. 2023లో భారత తలసరి వాస్తవ ఆదాయం సుమారు 1,000 డాలర్లు తక్కువగా ఉందని పరిశోధకులు అంచనా వేశారు. ఈ తేడాను మొత్తం ఆర్థిక వ్యవస్థకు అన్వయిస్తే సుమారు 1.4 ట్రిలియన్ డాలర్ల అదనపు ఆర్థిక ఉత్పత్తికి సమానమని నివేదిక పేర్కొంది. అంటే దేశంలో వేగవంతమైన ఆర్థిక వృద్ధిని సాధిస్తామని చెప్పిన మోడీ... అందులో విఫలమయ్యారు.

**'అభివృద్ధి'తో పాటు క్షీణించిన స్వేచ్ఛ**

ఈ అధ్యయనంలో అత్యంత ఆందోళన కలిగించే అంశం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై చేసిన అంచనా. 2023 నాటికి భారత్‌లో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ సూచీ.. మోడీ లేకుండా కొనసాగిన 'సింథటిక్ ఇండియా'తో పోలిస్తే 56.2 శాతం తక్కువగా ఉంది. ఇక మత స్వేచ్ఛ విషయంలో అధ్యయనం మరింత తీవ్ర అంతరాన్ని చూపించింది. 2023 నాటికి మత స్వేచ్ఛ సూచీలో భారత్, సింథటిక్ కౌంటర్ ఫ్యాక్చువల్ మధ్య 1.407 పాయింట్ల తేడా ఉందనీ, ఇది 2013 స్థాయితో పోలిస్తే 168.7 శాతం అంతరానికి సమానమని నివేదిక పేర్కొంది.?

**'సింథటిక్ ఇండియా' అంటే?**

ఈ అధ్యయనంలో కీలకమైన పదం 'సింథటిక్ ఇండియా'. మోడీ ప్రధానమంత్రి కాకపోయి ఉంటే 2014 తర్వాత భారత్ ఎలా అభివృద్ధి చెందేదో ప్రత్యక్షంగా చూడటం అసాధ్యం. అందుకే పరిశోధకులు 1984-2013 మధ్య భారత పనితీరుకు దగ్గరగా ఉన్న వివిధ దేశాల డేటాను కలిపి ఒక కఅత్రిమ నమూనాను రూపొందించారు. ఆ నమూనాలో ఆర్థిక విశ్లేషణకు బంగ్లాదేశ్, చైనా, ఇథియోపియా, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్ వంటి దేశాలను పరిగణనలోకి తీసుకున్నారు. తర్వాత 2014-2023 మధ్య నిజమైన భారత్ పనితీరును ఈ నమూనాతో పోల్చారు.

**ప్రతిపక్షాల అనైక్యతే బీజేపీకి బలం**

ఇక్కడే మరో కీలక ప్రశ్న ఎదురవుతుంది. పనితీరుపై ఇలాంటి విమర్శలు ఉంటే బీజేపీ ఎందుకు వరుసగా ఎన్నికల్లో బలమైన రాజకీయ శక్తిగా కొనసాగుతోంది? అని. పరిశోధకులు దీనికి భారత ఎన్నికల విధానాన్ని, ప్రతిపక్షాల విభజనను కారణాలుగా సూచించారు. బీజేపీకి మొత్తం ఓటర్లలో సంపూర్ణ మెజారిటీ లేకపోయినా.. ప్రతిపక్ష ఓట్లు విభజించబడటం వల్ల పెద్ద పార్టీగా అధికారాన్ని సాధించగలుగుతోందని పేర్కొన్నారు.

# మీర్ ఆలం చెరువుకు కొత్త హంగులు

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చెరువు పునరుజ్జీవం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం.. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే, మిర్ ఆలం చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సందర్శన సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవంతో పాటు నీటి నాణ్యతను మెరుగు పరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

**వాటర్ స్పోర్ట్స్‌కు డిజైన్**

మిర్ ఆలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు. దీంతో యువతతో పాటు కుటుంబాలకు కూడా ఆకర్షణీయమైన వినోద కేంద్రంగా మిర్ ఆలం మారుతుందని అభిప్రాయపడ్డారు. చెరువు చుట్టూరా ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోదం, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతో పాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచనున్నారని తెలిపారు.?

**ఐలాండ్లకూ కొత్త రూపు**

మిర్ ఆలం చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్(టెంట్లు వేయడం), ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే అవకాశాలను అధికారులు పరిశీలించాలని చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పీపీపీ విధానంలో ప్రయివేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు.?

**జూ పార్కుతో సమగ్ర పర్యాటక అనుసంధానం**

సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటుందన్నారు.

**సస్పెన్షన్ బ్రిడ్జి పనుల్లో 50 శాతం పురోగతి**

మిర్ ఆలం ట్యాంక్‌పై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. ఆగస్టు 27 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. అంటే 50.18 శాతం పనులు పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లో 28 పూర్తి కాగా, 45.16 శాతం పురోగతి నమోదైంది. 62 పియర్-కమ్-పియర్ క్యాప్స్‌లో ఇప్పటివరకు ఆరు పూర్తయ్యాయి. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న మిర్ ఆలం చెరువు పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. చారిత్రక చెరువు, పచ్చని పరిసరాలు, నెహ్రూ జూ పార్కు సమీపం, ఐలాండ్లు, వాటర్ స్పోర్ట్స్, కుటుంబ వినోదం, ఫుడ్‌కోర్టులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జితో మిర్ ఆలం ట్యాంక్‌కు సరికొత్త గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. సమగ్ర అభివృద్ధి పూర్తయితే హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రముఖ పర్యాటక కేంద్రంగా మిర్ ఆలం ట్యాంక్ మారనుంది. కుటుంబం మొత్తం ఒకే చోట రోజంతా ప్రకృతి, వినోదం, జలక్రీడలు, విశ్రాంతిని ఆస్వాదించేలా మిర్ ఆలం చెరువును తీర్చిదిద్దనున్నారు.

# సంపాదకీయం

## దారి తప్పుతున్న టీనేజ్...



పాఠశాల గేటు దాటే పిల్లల చేతుల్లో పుస్తకాలు, పెన్నులు ఉండాలి. పరీక్షల గురించి ఆలోచిస్తూ, ఆటల గురించి మాట్లాడుకుంటూ, స్నేహితులతో నవ్వుకుంటూ ఇంటికి తిరిగి రావాలి. కానీ అదే పిల్లల చేతుల్లో హత్యాయుధాలు కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయులపై, తోటి విద్యార్థులపై దాడులు, డ్రగ్స్.. ఇవన్నీ పాఠశాల వయసు పిల్లల చుట్టూ విని పిస్తున్నప్పుడు “పిల్లలు చెడిపోతున్నారు” అని చెప్పి ముందుకు వెళ్లిపోవడం సరిపోదు..నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో పాఠశాల ప్రిన్సిపాల్ హత్యకు సంబంధించిన ఘటనలో పదో తరగతి విద్యార్థుల ప్రమేయం ఉందన్న విషయం ఈ ఆందోళనను మరింత పెంచింది. కూకట్‌పల్లిలో తోటి విద్యార్థిపై దాడి, నిజామాబాద్‌లో విద్యార్థినిపై లైంగిక దాడికి సంబంధించిన ఘటనలు కూడా సమాజాన్ని కలవరపెడుతున్నాయి.. ఇవి కేవలం పోలీసు కేసులు కావు.. ఇవి మన విద్యా వ్యవస్థకు, కుటుంబ వ్యవస్థకు, సమాజానికి ఎదురవుతున్న ప్రశ్నలు..ఏ పిల్లవాడూ పుట్టుకతో నేరస్తుడు కాదు. ఒక పిల్లవాడు హింసాత్మకంగా మారడం వెనుక ఇంటి పరిస్థితులు, పాఠశాల లో వేధింపులు, స్నేహితుల ఒత్తిడి, మానసిక ఒత్తిడి, సోషల్ విడియా, సినిమాలు, డ్రగ్స్, గ్యాంగ్ సంస్కృతి వంటి అనేక ప్రభావాలు ఉండవచ్చు. పిల్లవాడు అకస్మాత్తుగా ఎక్కువగా కోప్పడటం, వస్తువులు పగలగొట్టడం, తల్లిదండ్రులతో మాట్లాడటం తగ్గించడం, పాఠశాలకు వెళ్లడానికి ఇష్టపడక పోవడం, స్నేహితులను మార్చుకోవడం, ఒంటరిగా ఉండటం, హింసాత్మక వీడియోలపై ఆసక్తి చూపించడం, బెదిరింపు భాష ఉపయోగించడం వంటి మార్పులు కనిపిస్తే వెంటనే అతడిని నేరస్తుడిగా ముద్ర వేయాల్సిన అవసరం లేదు. మన సమా జంలో పిల్లవాడు తప్పు చేసిన తర్వాత స్పందిస్తాం. కానీ అతను తప్పు చేసే దిశగా వెళ్తున్నప్పుడు మాత్రం గమనించం.స్మార్ట్‌ఫోన్, సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, సోషల్ విడియా పిల్లలకు జ్ఞానం, వినోదాన్ని అందించే సాధనాలే.. కానీ అదే సమయంలో హింస, సైబర్ బుల్లీయింగ్, డ్రగ్స్, గ్యాంగ్ కల్చర్, నేరాలను గొప్పగా చూపించే కంటెంట్ కూడా వారి ముందుకు వస్తోంది. హింసను హీరోయిజంగా, ప్రతీకారాన్ని గొప్పగా, నేరాన్ని స్టైల్‌గా చూపించే దృశ్యాలను పిల్లలు పదేపదే చూస్తున్నారు.. కొన్ని సెకన్ల షార్ట్ వీడియోల కోసం గంటల తరబడి ఫోన్‌లో గడుపుతూ, పక్కనే ఉన్న తల్లిదండ్రులతో పది నిమిషాలు మాట్లాడలేని పరిస్థితి కూడా ఏర్పడుతోంది. అయితే పిల్లల ప్రవర్తనకు ఫోన్, సినిమాలనే పూర్తిగా కారణంగా చూపడం కూడా సరైంది కాదు. సమస్య సాధ నాల్లో కంటే వాటిని పిల్లలు ఎలా ఉపయోగిస్తున్నారు, వారు చూస్తున్న కంటెంట్‌ను ఎలా అర్థం చేసుకుంటున్నారనే దాంట్లో ఉంది. అందుకే తల్లిదండ్రులు ఫోన్ లాక్కోవడం లేదా సినిమాలను నిందించడం మాత్రమే కాకుండా పిల్లలతో కలిసి కంటెంట్ గురించి మాట్లాడాలి.ఇప్పటి తల్లిదండ్రులకు మంచి పాఠశాలలో చదివించడం, సౌకర్యాలు కల్పించడం, ఖరీదైన ఫోన్ కొనివ్వడం తెలుసు.. కానీ పిల్లలతో ప్రశాంతంగా కూర్చొని మాట్లాడటానికి సమయం లేకపోవడం పెద్ద సమస్య. చదివావా ఎన్ని మార్కులు వస్తాయని అడగడం మాత్రమే కాదు. ఎలా ఉన్నావు.. ఏమైనా సమస్య ఉందా? ఎవరైనా ఇబ్బంది పెడుతున్నారా అని కూడా అడగాలి. పిల్లల చేతిలో ఫోన్ ఉందా లేదా అనేది మాత్రమే చూడటం కాదు. ఆ ఫోన్ కంటే ముందు వారి మనసులో ఏం జరుగుతుందో చూడాలి. పిల్లల నేరాలను కేవలం పోలీసుల సమస్యగా చూడలేం. ఇది కుటుం బం, పాఠశాల, ప్రభుత్వం, విడియా, సినిమా, సోషల్ విడి యా, సమాజం.. అందరి బాధ్యత. నేరం జరిగిన తర్వాత శిక్షిం చడం అవసరం.

కానీ అంతకంటే ముఖ్యమైనది నేరం జరిగే పరిస్థితులను ముందే గుర్తించడం. పిల్లల చేతుల్లో కత్తులు వచ్చిన తర్వాత మార్చడం కంటే, ఆ కత్తి అవసరం అనిపించని బాల్యాన్ని నిర్మించడం మన అసలు లక్ష్యం కావాలి.నవ మాసాలు మోసి, కని, పెంచి, పెద్ద చేసి, తమ పిల్లలు ప్రయోజకులై ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతి తల్లిదండ్రి కలలు కంటారు.. అయితే పిల్లలను పెంచడం మాత్రమే కాకుండా, వారిని సన్మార్గంలో నడిపించడం కూడా తల్లిదండ్రుల గురుతరమైన బాధ్యత. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం పిల్లలపై తీవ్రంగా పడుతున్న నేపథ్యంలో, వారు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లల నడవడికను, వారి ఆలోచనా విధానాన్ని, స్నేహ సంబంధాలను, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారికి సరైన మార్గదర్శకత్వం అందించాలి. అంతేకాకుండా పెద్దల పట్ల గౌరవం, చిన్నల పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత వంటి సద్గుణాలను అలవర్చాలి. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమైనది.ఏ లక్ష్యం కోసం అయితే, ఏ ఆశయం కోసం అయితే విద్యార్థులు మన చెంతకు చేరుతున్నారో, వారి ఆశయాలను నెరవేర్చడానికి గురువులుగా అంకితభావంతో పనిచేయవలసిన గురుతర బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యా యుడిపై ఉంది. విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటునందించాలి. విద్యార్థులలో క్రమశిక్షణ లోపించకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు ప్రతి పిల్లవాడిని తీర్చిదిద్ద వలసిన బాధ్యత అందరిపై ఉంది. ‘కొందరు చేస్తారు – మేము మాత్రం చూస్తాం’ అనే కొందరి ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం వలన మొత్తం ఉపా ధ్యాయ లోకం అభాసుపాలు అయ్యే అవకాశం ఉంది. కావున పిల్లలలో క్రమశిక్షణను పెంపొందించడంలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు భాగస్వామ్యం కావాల్సిన అవసరం తప్పనిసరి.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు, క్రమశిక్షణ పొంపొందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యాలయాలకు కిలోమీటర్ దూరంగా ఎలాంటి మత్తు పదార్థాలనుగాని ఇతర ధూమపాన వస్తువులను విక్రయించకుండా నిషేధించాలి. ఒకవేళ అనధికారికంగా మత్తు పదార్థాలను విక్రయించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. క్రమశిక్షణ లోపించిన విద్యార్థులలో, క్రమశిక్షణ పెంపొందించడానికి కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలి. ఏది ఏమైనప్పటికీ ఆధునిక కాలంలో కూడా విద్యార్థులలో సన్నగిల్లుతున్న క్రమశిక్షణను దారిలో పెట్టడానికి, తల్లిదండ్రులు, గురువులు, ప్రభుత్వం, సమాజ భాగస్వామ్యంతో కలిసి విద్యార్థులలో విలువలతో కూడిన విద్యను అందించి, వారిలో సత్ప్రవర్తనను పెంపొందించేటట్లు చూడాలి.

# మాకు మేమే బాస్..!



- ఉపాధిలో అక్రమాలు...! • అర్హత లేని వ్యక్తులు కూలీలు
- పని చేయకుండానే వేతనాలు
- పైసలతో అధికారులు కుమ్మక్కు
- కలెక్టర్ సారు జరా ఇటు చూడరు...!

**పామిడి – సూర్య వాస్తవం :**
పామిడి మండలంలోని ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు అవకతవకలు జరుగుతున్నాయంటూ ప్రజా సమస్యలపరిష్కార వేదిక (పిజిఆర్ఎస్, గ్రీవెన్స్) ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ పథకం పనుల్లో అర్హతలేని వ్యక్తులను కూలీలుగా నమోదు చేయడం, పనులు చేయకుండానే వేతనాలు చెల్లించడం వంటి ఆరోపణలను జూలై 14న జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడమైనదని, ఫిర్యాదుదారుడు పేర్కొన్నారు. ఎస్ఎల్ఎ రోజుల సంఖ్య 30 రోజులలో పరిశీలించి పరిష్కారం చేయాలని జిల్లా అధికారులు గడువు ఇచ్చారు. ఆగడువు దాటిపోయి రెండు వారాలు కావస్తున్నా పరిష్కారం జరగలేదన్నారు.

ఈ వ్యవహారంపై అధికారులు పరిశీలన చేపట్టినట్లు పత్రంలో పేర్కొన్నారు. పరిశీలనలో పలు జాబ్‌కార్డులకు సంబంధించి వేతనాల చెల్లింపులు జరిగినట్లు గుర్తించినట్లు వివరించారు. కొన్ని పనులకు సంబంధించి చెల్లింపుల వివరాలను కూడా అధికారులు నమోదు చేశారు. 2024 నుంచి గ్రామస్థాయిలో మరింత సమగ్రంగా విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఫిర్యాదుదారులు విజ్ఞప్తి చేశారు. 2024లో అప్పటి ఎంపీడీవోకు ఎన్నో దఫాలుగా ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఫీల్డ్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్లు, అలాగే ఏపీవో,ఎంపీడీవో,లు తదితర ఉపాధి హామీ పథకం యంత్రాంగం అంతయు కుమ్మక్కై ప్రభుత్వాలను, ఉపాధి పనులను ప్రక్కదోవ పట్టిస్తున్నారని,అవినీతి అక్రమాలకు అంతే లేకుండా ఉందని,బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిర్లక్ష్యాన్ని బట్టి ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఆపై అధికారులు అందరూ కుమ్మక్కై అక్రమాలు, అవినీతిని తొక్కేస్తున్నారని ఆ గ్రామంలోని మేధావులు విద్యావంతులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎమ్మెల్యే అండదండలు నాకు ఉన్నాయని ఇలాంటి ఫిర్యాదులు నన్ను ఏమి చేసుకోలేవన్న ధీమా వ్యక్త పరచడం మరింత విడ్డూరంగా ఉందన్నారు. మండల అధికారుల నిర్లక్ష్య వైఖరిని జిల్లా అధికారులు గుర్తించి వీరిపై కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ ఖజానాకు తోడ్పడవలసిందిగా కోరుచున్నారు.

# రగిలిన మాటల మంటలు...!

- అనంత జెడ్పీ సమావేశం రసాభాస
- టీడీపీ, వైసీపీ ప్రజాప్రతినిధుల మధ్య మాటల యుద్ధం
- సభ్యుల ప్రశ్నలకు ఎంపీ పార్థ, ఎమ్మెల్యే దగ్గుపాటి పదేపదే అడ్డు
- తగ్గేదేలేదన్నట్లు జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ
- ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ ఏదీ?
- ప్రధాన సమస్యలపై చర్చించకనే ముగించిన సమావేశం




**అనంతపురం – ప్రతినిధి , సూర్య వాస్తవం:**
టీడీపీ–వైసీపీ ప్రజాప్రతినిధుల మధ్య ఆధిపత్య పోరుకు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సమావేశం వేదికైంది. రెండు పార్టీలకు చెందిన నేతల మధ్య మాటల యుద్ధం రగిలింది. పైచేయి సాధించాలన్న పట్టుదలతో రెండు వర్గాల వారి మధ్య మాటల మంటలు చెలరేగాయి. ఒకవైపు టీడీపీకి చెందిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మరోవైపు వైసీపీకి చెందిన జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, జెడ్పీటీసీ సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయి పై అంటే సై అంటూ మాటల యుద్ధానికి దిగారు. దీంతో సమావేశంలో ఎవరేం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజా సమస్యలపై చర్చ పక్కదారి పట్టింది. కీలక సమస్యలపై అర్థవంతంగా చర్చ జరగకుండా పోయింది.

**చివరి సమావేశం..ఆద్యంతం రసాభాస**

జెడ్పీలో వైఎస్సార్సీపీకి చెందిన చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, మెజార్టీ సభ్యులు ఉన్నారు. వారి పదవీకాలంలో వచ్చే నెల 24తో ముగియనుంది. దీంతో ఇదే చివరి సమావేశం. సమావేశానికి జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షత వహించగా, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, హిందూపురం ఎంపీ బీకే పార్థ, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశ్, అనంతపురం కలెక్టర్ ఆనంద్, శ్రీసత్యసాయి జిల్లా డీఆర్ఓ కొండయ్య, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మీ హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాకనే పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సమావేశ భవన్ కు విచ్చేసి కాసేపు కూర్చున్నారు. ఆ తరువాత ఇతర ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నాయంటూ వెళ్లిపోయారు. జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ చర్చను ప్రారంభించారు. ముందుగా ఆర్ డబ్ల్యూఎస్ శాఖపై చర్చ మొదలుపెట్టారు. ఆ శాఖకు చెందిన రెండు జిల్లాల ఎస్ఈలు ప్రగతి నివేదికలు చదివి వినిపిస్తుండగా.. ఎంపీ బీకే పార్థసారథి అడ్డు తగిలారు. నివేదికలు చదవడం మాని. జిల్లా వ్యాప్తంగా ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందని గుర్తించారో, వాటి పరిష్కారానికి చర్యలేం తీసుకున్నరో చెప్పాలని పేర్కొన్నారు. అంతలోనే కనగానపల్లి జెడ్పీటీసీ సభ్యుడు మారుతీ ప్రసాద్, చెన్నేకొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్ర, ఇతర సభ్యులు తమ ప్రాంతాల్లో నీటి సమస్య గురించి ప్రస్తావించారు. పీఏబీఆర్ నుంచి అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాల్లో తాగునీటి పైప్లైన్ కోసం గత ప్రభుత్వం రూ.90 కోట్లు మంజూరు చేయగా, 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని నిలదీశారు. ఎవరి తప్పిదం వల్ల ఇలా జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు. దీంతో ఎంపీ బీకే పార్థసారథి జోక్యం చేసుకున్నారు. అధికారులు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఎస్ఈ ఏదేదో పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ వల్ల ప్రభుత్వానిక చెడ్డపేరు వస్తోందని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమా, లేక ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లనా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఇలా జాప్యం జరుగుతోందని ఎస్ఈ బదులివ్వగా.. మీరేం చేస్తున్నారంటూ నిలదీశారు. దీంతో అక్కడి నుంచి చర్చ రాజకీయ రంగు పులుముకుంది. ఎంపీ బీకే, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి, జెడ్పీటీసీ సభ్యుల మధ్య మాటల యుద్ధం మొదలైంది. జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ వారించే ప్రయత్నం చేసినా ఎవరూ తగ్గలేదు. దీంతో ఇక్కడ రాజకీయాలు మాట్లాడొద్దని, ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ కొనసాగాలని కోరారు. ఇలా ఏ అంశంపై మాట్లాడినా.. మీ ప్రభుత్వంలో ఇలా జరిగిందంటే మీ ప్రభుత్వంలో ఏం సాధించారంటూ మాటలు మంటలు రేపాయి. మెజారిటీ సభ్యులు తాగునీటి సమస్యలపై తమ గళం వినిపించారు. సభ్యులు సమస్యలను ప్రస్తావిస్తే.. అధికారులు సమాధానాలు చెబుతారు. అయితే ఇక్కడి సమావేశంలో మాత్రం అంతా తానై హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి వ్యవహరించారు. అన్నింటికీ ఆయనే సమాధానాలు ఇస్తుండడంతో సభ్యులు మరోసారి మండిపడ్డారు. మీరెందుకు సమాధానాలు ఇస్తారు? అధికారులు ఉన్నారు కదా అంటూ చుట్టుముట్టారు. గతంలో నీళ్లను ట్యాంకర్లతో తోలగా, వాటికి ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని, బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని సభ్యులు పట్టుబట్టారు. మడకశిర ప్రాంతంలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం నీళ్లు రావడం లేదని, కార్యాలయానికి వెళ్తే ఎవరూ ఉండడం లేదని జెడ్పీటీసీలు ఆరోపించారు. దీనిపైనా సుదీర్ఘ వాదన కొనసాగింది. ఎంపీ పార్థ కల్పించుకుంటూ కలెక్టర్ చొరవ తీసుకొని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమై సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలని కోరారు.

**తాగు, సాగునీటికి తక్షణ చర్యలు: అనంతపురం కలెక్టర్ ఆనంద్**

సమావేశంలో కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. జిల్లాలో తాగు, సాగునీటికి సంబంధించి యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బోర్లు, తాగునీటి పథకాల మరమ్మతుల కోసం అవసరమైతే డీఎంఎఫ్ నుంచి రూ.4 కోట్లు, అత్యవసర నిధుల కింద రూ.48 లక్షలు, జెడ్పీ నుంచి మరో రూ.60 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. ఫిర్యాదులు అందిన 24 గంటల్లోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఎల్.నినో నేపథ్యంలో జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 40 నుంచి 50 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. హెచ్ఎల్సీ నుంచి నీటి కేటాయింపు గతంలో 25 టీఎంసీలు ఉండగా, ఈ సంవత్సరం ప్రో–రాటా పద్ధతిలో కేవలం 16 టీఎంసీలు మాత్రమే కేటాంంచే అవకాశం ఉందన్నారు. తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇస్తూ, ఎక్కువ నీటిని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని సుమారు 800 గ్రామాలకు ఆర్డబ్ల్యూఎస్, జీబీసీ కెనాల్ ద్వారా గుంతకల్లు మున్సిపాలిటీకి భద్రపరచాల్సి ఉందన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ నీటి కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర స్థాయి నుంచి 4 టీఎంసీలు కేటాయించినప్పటికీ కేఆర్ఎంబీ(కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు) మీటింగ్లో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఎల్.నినో ప్రభావం మరో ఏడాదిన్న వరకు ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎక్కువ నీరు అవసరమయ్యే వరి, మిర్చి వంటి పంటలు సాగు చేయవద్దని రైతులను కోరారు.

**ఉపాధి పథకంపై రగడ**

ఉపాధి హామీ పథకంపై చర్చ ప్రారంభించగా మరోసారి టీడీపీ, వైసీపీ ప్రజాప్రతినిధుల మధ్య తీవ్ర వాగ్వాదం చెలరేగింది. ఉపాది హామీ పథకం పేరు మార్చితే సరిపోదని, కూలీలందరికీ ఉపాధి కల్పించి, వలసలు పోకుండా ఆపాలని వైసీపీ జెడ్పీటీసీ సభ్యులు కోరగా.. ఎంపీ పార్థ జోక్యం చేసుకున్నారు. పథకం గురించి మీకు అవగాహన లేదనంటూ చురకలు అంటించడంతో వైసీపీ సభ్యులు దండెత్తారు. జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తుండగా.. ఎంపీ బీకే కల్పించుకొని ‘నువ్వు ఉండమ్మా’ అంటే ఏకవచనంతో సంబోధించడంతో సంస్కారంతో మాట్లాడటం నేర్చుకోండంటూ జెడ్పీటీసీ చంద్ర చురకలంటించారు. దీంతో ఎంపీ బీకే .. జెడ్పీ చైర్పర్సన్ గిరిజమ్మకు రెండు చేతులతో దండం పెట్టేశారు.

**విద్యార్థి కుటుంబానికి ఎక్స్ గ్రేషియా చెల్లించాలి**

శెట్టూరులోని ప్రభుత్వ హాస్టల్లో సరైన వసతులు లేక, బహిర్భూమికి వెళ్లిన సమయంలో గోడ కూలి ఓ విద్యార్థి మరణించగా, మరో విద్యార్థి గాయపడ్డాడని జెడ్పీటీసీ నాగరాజు తెలిపారు. జిల్లా పర్యటనకు విద్యా శాఖ మంత్రి లోకేశ్ వచ్చినా.. బాధిత కుటుంబానికి పరామర్శించకపోవడం దారుణమన్నారు. మరణించిన విద్యార్థి కుటుంబానికి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.5 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, విద్యార్థి ప్రాణం అంతేనా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి, రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని సభ్యులు డిమాండ్ చేశారు. గతంలో ఓడీచెరువులో ఒక విద్యార్థి, ఇప్పుడు శెట్టూరులో మరో విద్యార్థి అకాల మరణం చెందారని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు.



## ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి



**బెలుగుప్ప – సూర్య వాస్తవం:** బెలుగుప్ప మండలం బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాయదుర్గం--అనంతపురం ప్రధాన రహదారిపై రాత్రి సుమారు 3 గంటల సమయంలో ఇన్నోవా కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారికి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లి తిరిగి కళ్యాణదుర్గం వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కారులో ప్రయాణిస్తున్న కోమటి నాగరాజు (55), కోమటి గుప్తా (45) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో కోమటి గుప్తా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో బలిజ నరహరి, కోమటి హర్ష స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చైతన్య స్కూలు ఉపాధ్యాయురాలు అరుణపై కత్తితో దాడి



**గుంతకల్ – సూర్య వాస్తవం :** గుంతకల్లు పట్టణంలోని రాజేంద్రనగర్ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో టీచర్ అరుణ రెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. దాడిలో తీవ్రంగా గాయపడిన అరుణ రెడ్డిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అరుణ రెడ్డి భర్త కృష్ణారెడ్డి రైల్వేలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తన భార్యపై దాడి ఘటనకు సంబంధించి తనకు కూడా ఎలాంటి సమాచారం లేదని ఆయన తెలిపినట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులు ఎవరు, దాడికి గల కారణాలు ఏమిటనే విషయాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

## తొండపాడు సొసైటీ బ్యాంక్ గోడౌన్ ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ నాయకులు



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి మండలం తొండపాడు గ్రామంలో గురువారం గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుత్తి పామిడి మండలాల ఇన్‌చార్జి యువనేత గుమ్మనూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో గుత్తి మండలంలోని తొండపాడు సొసైటీ బ్యాంకు సంబంధించి గోడౌన్ రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గోడౌన్‌ను తొండపాడు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర్ యాదవ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ బర్దివలి, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీ రంగయ్య, మాజీ ఎంపిటిసి వెంకటనారాయణ, సొసైటీ డైరెక్టర్లు కలసి ప్రారంభించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ జాబ్ కార్డు ఇచ్చి ఆదుకోండి

**- సంబంధిత అధికారికీ సిపిఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత**

**పామిడి – సూర్య వాస్తవం:** ఉపాధి హామీ పథకం పనులకు జాబ్ కార్డు కొరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం స్థానిక పామిడి సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కొరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు కే.రహీం మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంబంధించిన ప్రజలకు పొట్ట నింపుట కొరకై ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో జాబు కార్డు లేక పనులు లేక వ్యవసాయ కూలీలుగా పనికి పోదామంటే వర్షాలు రాక రైతులు అల్లకల్లోలం చెందుతున్నారు. ఇలాంటి దుస్థితిలో మాలాంటి వారిని రైతులు కూలీలుగా ఉపయోగించుకొనుటకు లెనోవో ప్రభావంతో పనులు లేవంటున్నారు అలాంటి పరిస్థితుల్లో మాలాంటివారు బ్రతకడం ఎలా అని వాదిస్తున్నారు. కనీసం ఉపాధి జాబ్ కార్డులైనా ఇచ్చి ఆదుకోవాలని వారిని విజ్ఞప్తి చేశారు సమస్యల వినతి పత్రాన్ని సంబంధిత అధికారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కె రహీం మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు కోదండరామిరెడ్డి ఇమాములు కటిక మంజుల భాయ్, కటిక రుక్మిణి బాయ్ బి లక్ష్మి పోతుల రామలక్ష్మి సయ్యద్ షేక్ నోరో సాలమ్మ జారుతున్న సాలమ్మ, షేక్ నూర్ భాను, జట్కా విజయలక్ష్మి, విజయలక్ష్మి భాయ్, మీనాక్షి, సుంకమ్మ, మస్తాన్ బి, హుస్సేన్ బి తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి...!

**- 19 మంది విద్యార్థుల అస్వస్థతపై సమగ్ర విచారణకు డిమాండ్**
**- గురుకుల పాఠశాలలో సమస్యలపై విద్యార్థి సంఘాల ఆందోళన**



**హిందూపురం – సూర్య వాస్తవం:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 19 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలను సందర్శించిన నాయకులు అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గురుకుల పాఠశాలకు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాల ఆవరణను క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం, గడ్డి పెరిగిపోయి దోమలు, విషపురుగుల బెడద ఎక్కువగా ఉందన్నారు. దీనివల్ల విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలో డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, బియ్యంలో పురుగులు కనిపిస్తున్నాయని విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని, రాత్రివేళల్లో తగిన లైటింగ్ సదుపాయం కూడా లేదని విద్యార్థులు వాపోయినట్లు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కాంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, పారిశుధ్యం, విద్యుత్ వెలుగులు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని పిడియస్‌యు ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బద్రీనాథ్, నాగేంద్ర, రోషన్, మహేష్, నంద, వలీసాబ్, లక్ష్మీపతి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ మునీషన్ నిల్వలపై ఎస్పీ జగదీష్ సమీక్ష...!

**- అత్యవసర పరిస్థితుల్లో పరికరాలు సిద్ధంగా ఉండాలి**
**- ఎక్స్‌పైరీ రసాయన పరికరాలను వేరు చేయాలి**
**- ఆధునిక సాంకేతికతతో నిల్వల నిర్వహణకు ప్రాధాన్యం**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో భద్రపరిచిన గ్యాస్ మునీషన్ నిల్వలు, పరికరాల పనితీరుపై జిల్లా ఎస్పీ పి. జగదీష్ గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాష్పవాయు నిల్వలు, వాటి నిల్వ సామర్థ్యం, సంబంధిత పరికరాలను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. శాంతిభద్రతల సమస్యలు, అత్యవసర పరిస్థితుల్లో గుంపులను నియంత్రించేందుకు వినియోగించే గ్యాస్ మునీషన్ ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గడువు ముగిసిన రసాయన పరికరాలను గుర్తించి వేరు చేయాలని, ఆధునిక సాంకేతికతతో కూడిన పరికరాలు, నిల్వ విధానాలపై దృష్టి సారించాలని సూచించారు. గ్యాస్ మునీషన్ వినియోగంపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు. సమయానుకూలంగా మాక్ డ్రిల్స్ నిర్వహించి సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే లక్ష్యంగా సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి...!

**- హిందూపురం న్యాయవాదుల భారీ బైక్ ర్యాలీ.. విధులు బహిష్కరించి నిరసన**



**హిందూపురం టౌన్ – సూర్య వాస్తవం :** రాయలసీమ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హిందూపురం న్యాయవాదులు విధులను బహిష్కరించి గురువారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొని ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. రాయలసీమ ప్రజలకు న్యాయం జరిగేలా ఆలస్యం చేయకుండా కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాది ఇందాద్ మాట్లాడుతూ.. రాయలసీమ ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కావాలంటే కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు అత్యవసరమన్నారు. బెంచ్ ఏర్పాటుతో ప్రజలకు సమయం, ధనం ఆదా కావడంతో పాటు న్యాయ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని వెంటనే డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు. బైక్ ర్యాలీలో హిందూపురం బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొని కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. రాయలసీమ హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ కృష్ణమూర్తి, న్యాయవాదులు రామచంద్రరెడ్డి, నాగరాజురెడ్డి, రాజశేఖర్, సిద్ధగంగప్ప, శ్రీనివాసరెడ్డి, సుబ్రమణ్యశాస్త్రి, రకీబ్, ఆసిఫ్, యూసుఫ్, భరత్ సింహారెడ్డి, లోకేష్, ముజీబ్, పనీభూషణ్, కద్రిష్, చంద్రారెడ్డి, జైద్ రెహమాన్, ప్రశాంత్, వినోద్, వెంకటేష్, మహిళా న్యాయవాదులు సంతోషి మాత, నౌరీన్, ఆశా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్ప స్టడీ మెటీరియల్ బహూకరణ

**తనకల్లు – సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని తనకల్లు ప్రభుత్వ కళాశాలలో సంకల్ప స్టడీ మెటీరియల్ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ చేతుల మీదుగా విద్యార్థినీ, విద్యార్థులకు అందజేయడం జరిగినది ప్రభుత్వం పంపిణీ చేసిన సంకల్ప స్టడీ మెటీరియల్ పోటీ పరీక్షలకు సన్నాదం చేసేందుకు ప్రత్యేక చర్యలు ప్రభుత్వం చేపడుతుంది, అలాగే జేఈఈ. నీట్ ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడే రూప కల్పనగా రూపొందించారు విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ మెటీరియల్ అన్ని రకాల పరీక్షలకు( యూనిట్ టెస్ట్ లు, ప్రీ ఫైనల్, పబ్లిక్ పరీక్షలు ) ఇలాగ అన్ని రకాల పరీక్షలకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ స్టడీ మెటీరియల్ తో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థిని విద్యార్థులను ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు



## వైసీపీ రాష్ట్ర మైనారిటీ సెల్‌లో కదిరి నేతలకు కీలక పదవులు...!

**- రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా సాధత్ అలీఖాన్**
**- సంయుక్త కార్యదర్శిగా షేక్ అబూబకర్ నియామకం - కదిరి వైసీపీ కార్యాలయంలో ఘన సన్మానం**



**కదిరి టౌన్ – సూర్య వాస్తవం :** వైసీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ప్రముఖ వ్యాపారవేత్త కె. సాధత్ అలీఖాన్, సంయుక్త కార్యదర్శిగా షేక్ అబూబకర్ నియమితులైన సందర్భంగా కదిరి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కదిరి సమన్వయకర్త బి.ఎస్. మక్బుల్ ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, వివిధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలలతో వారిని అభినందించారు. ఈ సందర్భంగా సాధత్ అలీఖాన్, షేక్ అబూబకర్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ నియామకానికి సహకరించిన కదిరి సమన్వయకర్త బి.ఎస్. మక్బుల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## ప్రశ్నించిన వారే 'దిమాగీ నక్సల్స్'నా?

**- వైసీపీ రాయలసీమ అధికార ప్రతినిధి కె.వి.రమణ విమర్శలు**

**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం:**



ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తున్న వారిని 'దిమాగీ నక్సల్స్'గా ముద్ర వేయడం ప్రజాస్వామ్యమా? అని వైఎస్సార్‌సీపీ రాయలసీమ అధికార ప్రతినిధి కె.వి. రమణ ప్రశ్నించారు. దేశంలో అధికారంలోకి వచ్చిన వారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని, వాటిపై ప్రజలు ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగాలు, ఆర్థిక పరిస్థితి, విద్య, రైతుల సమస్యలపై యువత ప్రశ్నిస్తే వారిని తప్పుబట్టడం సరికాదన్నారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, ప్రశ్నించే గొంతులను అణచివేయకుండా వారి సమస్యలకు సమాధానాలు ఇవ్వాలని రమణ అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై వివిధ వర్గాల ప్రజలు, విద్యార్థులు, రైతులు చేస్తున్న విమర్శలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. విద్య, ఉపాధి అవకాశాలు, రైతుల సమస్యలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన విధానాలను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను, దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందంటూ రమణ ఆరోపించారు. ఈ ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నేతలు ఖండించే అవకాశం ఉంది. ఎన్నికల ప్రక్రియపై కూడా ఆయన పలు ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం ఉండేలా పారదర్శకతను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు.ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ దేశ వ్యతిరేకులుగా లేదా 'దిమాగీ నక్సల్స్'గా చిత్రీకరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని రమణ పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూ, ప్రభుత్వాలను జవాబుదారీగా నిలబెట్టడమే ప్రజాస్వామ్యానికి బలమని ఆయన అన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

**పామిడి – సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మిలాద్‌ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని పామిడి నాగిరెడ్డి కాలనీ మిలాద్ కమిటీ ఆధ్వర్యంన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రధాన సభ్యులు చిలకల రాజగోపాల్ నేతృత్వంలో గురువారం అన్నదాన కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకల రాజగోపాల్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సమాజానికి ఇచ్చిన సందేశంలో నిరుపేదల ఆకలిదప్పులు తీర్చవలెనని మానవులందరినీ సమానముగా చూడాలని ఇబ్బందులలో ఆదుకొనుట దర్మమని, మానవసేవయే మాధవ సేవని ప్రవక్త మహమ్మద్ ఇచ్చిన బోధనలను స్మరించుకుంటూ సందేశాలఅంశంలో భాగంగా మిలాద్ కమిటీ వారు సహృదయంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు ప్రజలకు సిబ్బందికి అన్నదానం కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మహేష్, శివ కార్తీక్ రెడ్డి, చిలకల రాజగోపాల్, రాజు రెడ్డి కాలనీ మిలాద్ కమిటీ సభ్యులు షేక్షావలి,బాబా, శామీర్, నభీ, దూద, పెయింటర్ షేక్షా, ఫయాజ్, పీరా, దాదా కలందర్, తదితరులు పాల్గొన్నారు.



# కాంట్రాక్టర్లపై మీకెందుకు అంత ప్రేమ..?

**- రెండేళ్లుగా పనులు చేయని కాంట్రాక్టర్లను ఎందుకు తొలగించలేదు?**
**- సభలో వైసీపీ సభ్యుల ప్రశ్నలకు ఘాటుగా సమాధానం**
**- కాంట్రాక్టర్లపై చర్యలకు జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని డిమాండ్**
**- జడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే దగ్గుపాటి**



**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం :** రెండేళ్లుగా పనులు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారులను నిలదీశారు. అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు.నాలుగు పంచాయతీల్లో తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకెళ్లారు. రెండేళ్లుగా పనులు పూర్తి చేయకపోయినా కాంట్రాక్టర్లను ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. ఇప్పటికే నోటీసులు ఇచ్చామని అధికారులు చెప్పగా.. ఇంతకాలం పనులు జరగకపోతే వచ్చే వేసవిలో తాగునీటి సమస్యను ఎలా ఎదుర్కోవాలని నిలదీశారు. వెంటనే కాంట్రాక్టర్లను తొలగించి, కొత్తవారికి పనులు అప్పగించి యుద్ధప్రాతి పదికన పూర్తి చేయాలని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

**వైసీపీ సభ్యులకు ఘాటుగా సమాధానం**

సభలో వైసీపీ సభ్యులు పలు అంశాలను ప్రస్తావించగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ధీటుగా స్పందించారు. హెచ్‌ఎల్‌సీ, హంద్రీనీవా కాలువల నీటిని సాగుకు ఇవ్వాలని వైసీపీ సభ్యులు కోరగా.. ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో హంద్రీనీవా, హెచ్‌ఎల్‌సీ కాలువల గురించి పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హంద్రీనీవాకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.

**అలవెన్సుల అంశంపైనా కౌంటర్**

జడ్పీటీసీ, ఎంపీటీసీలకు అలవెన్సులు అందడం లేదంటూ వైసీపీ సభ్యులు ప్రభుత్వం తీరును ప్రశ్నించగా.. గత సమావేశాల్లోనే ఈ అంశాన్ని ప్రస్తావించి ఉంటే ప్రభుత్వం చెల్లింపులకు చర్యలు తీసుకునేదని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సమస్యపై ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు.

**విద్యారంగంలో మార్పులు వచ్చాయి**

వసతి గృహాలు, పాఠశాలల్లో సమస్యలు ఉన్నాయంటూ వైసీపీ సభ్యులు ప్రస్తావించగా.. మంత్రి నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యాశాఖలో అనేక మార్పులు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల చేరికలు పెరుగుతున్నా యని, ఎక్కడ సమస్య ఉన్నా మంత్రి వెంటనే స్పందిస్తున్నారని పేర్కొన్నారు.

# రీ సర్వే గ్రామసభ అవగాహన ర్యాలీ

**తనకల్లు – సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూ సర్వే రికార్డులు 100 సంవత్సరాల క్రితం తయారు చేయబడ్డాయి. ఆ తర్వాత భూమిపై జరిగిన సరిహద్దుల మార్పులు పూర్తి స్థాయిలో చేయకుండా రికార్డులు కొనసాగించ బడ్డాయి ప్రస్తుత సాంకేతిక, ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా, రికార్డులను ఆధునీకరిస్తూ మెరుగైన నాణ్యతతో, రాష్ట్రంలోని ప్రతి భూ యజమానికి న్యాయం చేయడం కోసం రీ-సర్వే కొనసాగుతోంది." భూయ జమానుల సంతృప్తే ధ్యేయంగా భూముల రీసర్వే విధానాన్ని సమూలంగా మార్చివేసి, నూతన విధానంలో భూసర్వేని చేపట్టడం జరుగుతుంది. రీసర్వే చేపడుతున్న గ్రామాల్లోని భూయజమానులకు సర్వే జరిగే తేదీ, సమయమును ముందుగానే వ్యక్తిగత నోటీసు ద్వారానే కాకుండా, ఎస్ఎంఎస్, ఫోన్‌కాల్స్ ద్వారా లేదా వాట్సాప్ సందేశం ద్వారా కూడా తెలియజేయడం జరుగుతుంది. గ్రామసభ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి రీసర్వే అంటే ఏమిటి? ఎలా చేస్తారు? తేడాలు ఎప్పుడు వస్తాయి? ఎలా వస్తాయి? వాటిని పరిష్కరించడానికి ఏం చేయాలో ఉన్న సందేహాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరిస్తారు. రెవెన్యూ డివిజనల్ అధికారి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.




ప్రతి గ్రామమును 200 నుంచి 250 ఎకరాలకు ఒక బ్లాక్‌గా విభజించి, ఒక బ్లాక్ టీం అనగా గ్రామ సర్వే, రెవెన్యూ బృందముచే ప్రతి భూ కమతమును సర్వే చేస్తారు. బ్లాక్ పరిధిలో ఉండే భూయజమానులందరితో వాట్సాప్ గ్రూప్ తయారుచేస్తారు. ఎవరైనా భూ యజమాని హద్దులు చూపించడానికి మొదటి నోటీసు తేదీ నాటికి రాలేకపోతే, మరల అవకాశం కల్పిస్తారు. అప్పటికీ రాలేకపోతే మూడవసారి కూడా అవకాశం కల్పిస్తారు. సంబంధిత నోటీసులు వాట్సాప్ గ్రూపులో కూడా పోస్ట్ చేయబడును. అప్పుడు కూడా హాజరు కాకపోతే వీడియో కాల్ ద్వారా నిర్ణయించిన భూమి హద్దుల సమాచారాన్ని భూ యజమానికి తెలియజేయడం జరుగుతుంది. సర్వే రికార్డుల్లోని తేడాలను, రెవెన్యూ రికార్డుల్లోని తేడాలను గ్రామ సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారి మరియు రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ చూసి అక్కడికక్కడే సవరణలకు సిఫార్సు చేస్తారు. ప్రతి భూమికి రీసర్వే బృందం వచ్చి భూ యజమాని చూపిన హద్దుల కోఆర్డినేట్స్‌ను రోవర్‌తో తీసుకొని ఇతర వివరములు నమోదు చేస్తారు. ఏదైనా భూ-కమతంలో గ్రామ సర్వేయర్ చేసిన సర్వేపై అభ్యంతరం ఉంటే, గ్రామ సర్వేయరుచే విచారించి హద్దులు నిర్ణయించడం జరుగుతుంది. అధికారుల నిర్ణయంపై అభ్యంతరములు ఉన్నట్లయితే అప్పీల్ చేసుకోవడానికి అవకాశం కలదు. అప్పీలు పరిష్కారం కోసం మండల స్థాయిలో విచారించి నిర్ణయం చేయడం జరుగుతుంది. గ్రామం పూర్తి, తుది రెవెన్యూ రికార్డులు తయారు చేసే వరకు మండల మొబైల్ బృందం (రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మండల సర్వేయర్) పూర్తి బాధ్యత వహిస్తారు. ఈ ర్యాలీలో వీఆర్వో హాబీవుల్లా. సర్వర్ మా భాష , వీఆర్ఏ కిష్ట , రెవెన్యూ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## విద్యార్థుల భద్రతే.... పోలీసుల లక్ష్యం...!

**- ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన**
**- డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. మైనర్ డ్రైవింగ్ చేయొద్దు**
**- ఎస్పీ పి. జగదీష్ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులు**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** విద్యార్థుల భద్రత, నేరాల నివారణే లక్ష్యంగా అనంతపురం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా ఈవ్‌టీజింగ్, మహిళలు--పిల్లలపై నేరాల నిరోధం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం, అత్యవసర పరిస్థితుల్లో 100/112 సేవలను వినియోగించడం వంటి అంశాలను వివరించారు.అలాగే మహిళల భద్రత కోసం శక్తి యాప్ వినియోగం, బాల్య వివాహాల నిర్మూలన, మైనర్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండటం, హెల్మెట్, సీటుబెల్ట్‌తో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని పేర్కొన్న జిల్లా పోలీసులు.. సురక్షితమైన, నేరరహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు

## రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యం..

**- విస్తృత వాహన తనిఖీలు...- అతివేగం, ర్యాష్ డ్రైవింగ్‌పై పోలీసుల నజర్**
**- భద్రతే లక్ష్యం.. హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరి.. - వాహనదారులకు పోలీసుల హెచ్చరిక.. నిబంధనలు పాటించాల్సిందే!**

**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యంగా అనంతపురం జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం, అతివేగం, ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని కోరారు."మీ భద్రతే మా బాధ్యత.. సురక్షిత ప్రయాణమే మా లక్ష్యం" అని పోలీసులు పేర్కొన్నారు.



# 'నేతన్న సేవ' పథకం అమలుపై సమీక్ష

- సమావేశంలో పాల్గొన్న"మంత్రి సత్య కుమార్"



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** ధర్మవరం ఎన్ డి ఏ కార్యాలయంలో ఆర్ డి ఓ చేనేత శాఖ అధికారులతో "నేతన్న సేవ"పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి సత్య కుమార్ యాదవ్. ఈ సందర్భంగా మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ.పథకానికి అర్హత ఉన్నవారిలో ఎంతమందికి ప్రయోజనం అందింది? ఇంకా ఎంతమందికి అందలేదు?అందకపోవడానికి కారణాలేంటి?అనే అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకం ప్రయోజనం అందాలి ఒక్క అర్హుడికి కూడా అన్యాయం జరగకూడదు అని మంత్రి స్పష్టం చేశారు.ఎక్కడైనా అర్హులకు అన్యాయం జరిగితే సహించేది లేదని అధికారులను హెచ్చరిస్తూ,పారదర్శకంగా,వివక్షకు తావులేకుండా సంక్షేమ ఫలాలు అందేలా బాధ్యతతో పనిచేయాలని అధికారులకు మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశించారు.చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా నేతన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్న సేవాభావ నాయకత్వం--సత్యకుమార్ యాదవ్

## ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న "మంత్రి సత్య కుమార్ యాదవ్"





**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** ధర్మవరం నుంచి బెంగళూరుకు వెళ్లే మార్గమధ్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు సహచర మంత్రులతో కలిసి నిర్వహించిన ఏపీ రిటైల్ ఎక్సైజ్ పాలసీ జిఓఎం సమావేశంలో మంత్రి సత్య కుమార్ గురువారం పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుత ఎక్సైజ్ విధానం అమలు తీరు,మద్యం దుకాణాల నిర్వహణ,రిటైలర్ల సాధ్యాసాధ్యాలు, దుకాణాల పునర్విభజన వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.రానున్న ఎక్సైజ్ పాలసీకి సంబంధించి వివిధ ప్రత్యా మ్నాయ విధానాలను పరిశీలించడంతో పాటు,పారదర్శకతను మరింత పెంచేలా సీసీటీవీ పర్యవేక్షణ, డిజిటల్ విక్రయాల ట్రాకింగ్,డిజిటల్ చెల్లింపులు వంటి సంస్కరణలపై కూడా చర్చ జరిగింది.రాష్ట్ర ప్రయో జనాలు, పారదర్శకత, సమర్థవంతమైన నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ తదుపరి ఎక్సైజ్ విధానాన్ని రూపొందించడంపై సమావేశంలో చర్చ జరిగింది.

## వివాహ వేడుకలో పాల్గొన్న కాకాని గోవర్ధన్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** తిరుపతిలో నిర్వహించిన వివాహ వేడుకకు మాజీ మంత్రి, వైసీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాకాని గోవర్ధన్ రెడ్డి సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య హాజరయ్యారు.నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసన్నంబెటి విజయ్ భాస్కర్ రెడ్డి కుమారుడు గౌతమ్--స్నిగ్ధల వివాహ వేడుకలో పాల్గొన్న వారు నూతన వధూవరులను ఆశీర్వదించి,వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వివాహ వేడుకకు హాజరైన బంధు మిత్రులు, ప్రముఖులు ఆత్మీయులను డాక్టర్ కాకాని గోవర్ధన్ రెడ్డి కిలివేటి సంజీవయ్య ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యేలు డా.నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ

**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** తిరుపతి నగరంలోని పిఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం జరిగిన నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి కుమారుడు గౌతమ్,స్నిగ్ధ ల వివాహ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు డాక్టర్ నెలవల విజయశ్రీ పార్థసారథి దంపతులు, కురుగొండ్ల రామకృష్ణ,ఆదిమూలం,పాశం సునీల్ కుమార్ లు నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతాలతో సాగాలని. ఆకాంక్షించారు.అలాగే వారి వెంట ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్,నాని,బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వాకాటి నారా యణరెడ్డి, మాజీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ రంగినేని కృష్ణయ్య,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకట రమణారెడ్డి,తిరుమూరు సుధాకర్ రెడ్డి,నానబాల సుబ్బారావు,మైలారి రాజశేఖర్, నిత్యా కృష్ణారెడ్డి, కాపులూరు చక్రపాణి, షేక్ ఖలీల్,లు నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# పర్యావరణ పరిరక్షణకు తిరుపతి జిల్లా పోలీసుల మరో ముందడుగు

- పుల్లంపేట ఎస్వీవీడీఎస్ హైస్కూల్‌లో 250 మొక్కలు నాటే కార్యక్రమం.
- విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన మొక్కల సంరక్షణపై ప్రత్యేక సూచనలు.
- పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా పోలీసుల ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం.
- "నేడు నాటిన మొక్కలు-రేపటి తరాలకు పచ్చని భవిష్యత్"



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్.ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కోడూరు రూరల్ సర్కిల్ పరిధిలోని పుల్లంపేట ఎస్వీవీడీఎస్ హైస్కూల్‌లో ఈరోజు మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడూరు రూరల్ సర్కిల్ సీఐ, పుల్లంపేట ఎస్ఐ కలిసి పాఠశాల ప్రాంగణంలో 250 మొక్కలను నాటారు.పాఠశాల పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ చెట్లు మానవాళికి స్వచ్ఛమైన గాలి,ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో,నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెద్ద చెట్టుగా పెంచడం అంతే ముఖ్యమని సూచించారు. "ఒక మొక్కను నాటడం అంటే ఒక భవిష్యత్తును నాటినట్లే"అని పేర్కొంటూ,ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి,దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. నేటి చిన్న ప్రయత్నాలు రేపటి తరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని భవిష్యత్తును అందిస్తాయని తెలిపారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ,సామాజిక బాధ్యత మరియు ప్రజల్లో చైతన్యం పెంపొందించే కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని అధికారులు తెలిపారు. పచ్చని,పరిశుభ్రమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు.



# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితుడికి 10 రోజుల జైలు శిక్ష

- రూ.12,500 జరిమానా విధించిన నాయుడుపేట కోర్టు
- మద్యం మత్తులో కంటైనర్ లారీ నడిపిన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు
- మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా, నాయుడుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి, అతివేగంగా మరియు నిర్లక్ష్యంగా కంటైనర్ లారీ నడిపి ప్రజల ప్రాణాలకు, భద్రతకు ప్రమాదం కలిగించిన డ్రైవర్‌పై నాయుడుపేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన నాయుడుపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి పి. మీనాక్షి సుందరి నిందితుడికి 10 రోజుల జైలు శిక్షతో పాటు రూ.12,500 జరిమానా విధించారు. 27.08.2026 అర్ధరాత్రి సుమారు 01:30 గంటల సమయంలో చెన్నై నుంచి నెల్లూరు వైపు జాతీయ రహదారిపై కంటైనర్ లారీ నెంబర్.టీయన్-88-జె - 2370ను నడుపుకుంటూ వస్తున్న డ్రైవర్ తియగరాజన్, మల్లాం జంక్షన్ సమీపంలో లారీని అతివేగంగా, నిర్లక్ష్యంగా ప్రమాదకరంగా నడుపుతున్నట్లు డయల్-112 ద్వారా నాయుడుపేట పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే నాయుడుపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.శివశంకర్ రావు, బీట్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని లారీని అడ్డుకుని తనిఖీ చేశారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో డ్రైవర్ మద్యం సేవించినట్లు 568 యంజి/100ఎంల్ గా నమోదైంది.దీంతో నిందితుడిపై నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో ఎంవి యాక్ట్ కింద కేసు నమోదు చేసి,దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.కేసును విచారించిన గౌరవ న్యాయస్థానం నిందితుడికి పై శిక్షను విధించింది.మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా వాహనదారులు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడుతున్నారని నాయుడుపేట పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో, అతివేగంగా, నిర్లక్ష్యంగా లేదా ప్రమాదకరంగా వాహనాలు నడిపే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు,కోర్టు ద్వారా శిక్షలు పడేలా చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు సందేశం ఇస్తూ,"మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా డ్రైవర్ తన ప్రాణాలతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడుతున్నాడు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కోర్టు ద్వారా శిక్షలు పడేలా చర్యలు కొనసాగిస్తాం. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనం నడపాలి.మీ కోసం ఎదురుచూస్తున్న కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షితంగా ప్రయాణించండి."అని అన్నారు. "ప్రజలకు పోలీసుల సందేశం":-మద్యం సేవించి వాహనం నడపవద్దు.ఒక్క క్షణం నిర్లక్ష్యం ఒక కుటుంబం జీవితాన్ని విషాదంలోకి నెట్టవచ్చు. వేగం కంటే ప్రాణం విలువైనది.మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణా లను కూడా కాపాడండి. సురక్షితంగా ప్రయా ణిద్దాం. క్షేమంగా ఇంటికి చేరుదాం.

## జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా వాటిని పంచుకొని పరిష్కారం వెతుక్కోవాలి

- ఆత్మహత్యలు చేసుకోకూడదు మంత్రి సత్య కుమార్



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** జీవితంలో ఎలాంటి కష్ట పరిస్థితులు ఎదురైనా వాటిని ఆత్మీయులతో కుటుంబ సభ్యులతో స్నేహితులతో పంచుకోని పరిష్కారం వెతుక్కోవాలి కానీ ఆత్మహత్యలు చేసుకోకూడదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు ఆయన గురువారం ధర్మవరం నియోజకవర్గానికి చెందిన కుటుంబ సభ్యులు శ్రీశైలంలో జరిగిన విషాదకర ఘటనలో మృతి చెందడం పట్ల వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బత్తలపల్లిలోని వారి స్వగృహానికి ఎమ్మార్వో,ఆర్డిఓ తదితర అధికారులతో కలిసి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి ప్రభుత్వం,ప్రజాప్రతినిధులు అండగా ఉంటారని భరోసా కల్పించారు.కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి,ప్రభుత్వం తరఫున కుటుంబానికి తక్షణంగా అందించగల సహాయ సహకారాలపై అక్కడికక్కడే అధికారులతో చర్చించి, అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తక్షణ సహాయంగా కొంత ఆర్థిక సహాయాన్ని కూడా అందించారు.జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ఆత్మీయులతో, కుటుంబ సభ్యులతో, స్నేహితులతో పంచుకుని పరిష్కారం వెతుక్కోవాలని,ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలకు ఎవరూ పాల్పడవద్దని మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## బాలికల హాస్టల్‌లో మహిళా భద్రతపై ప్రత్యేక అవగాహన

- 250 మంది విద్యార్థినులకు మహిళా భద్రతపై అవగాహన.
- రోడ్డు భద్రత,సైబర్ నేరాలు,మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన.
- అప్రమత్తంగా ఉండాలని విద్యార్థినులకు పోలీసుల సూచన.

**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు నాయుడుపేట పట్టణంలోని ఎల్.ఎ. సాగరం బాలికల హాస్టల్‌లో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 250 మంది విద్యార్థినులతో అధికారులు సమావేశమై మహిళలు,బాలికల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మహిళల భద్రత, రోడ్డు భద్రత,సైబర్ నేరాల నివారణ,మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు తదితర అంశాలపై విద్యార్థినులకు వివరించారు.సైబర్ మోసాలు,అపరిచిత వ్యక్తుల పరిచయాలు,అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే రహదారులపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు.మహిళలు,బాలికల భద్రతకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను అవసరమైన సమయంలో వినియోగించుకోవాలని, ఏదైనా సమస్య లేదా ఇబ్బంది ఎదురైన వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,విద్యార్థినులు అప్రమత్తంగా ఉండటంతో పాటు తమ చుట్టూ ఉన్నవారిలో కూడా భద్రతపై అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు.



## 'లూజర్' సాంగ్.. 'ఐయామ్ గేమ్' కోసం
## గాయకుడిగా మారిన దుల్కర్ సల్మాన్



యూత్ ఐకాన్, విలక్షణ నటుడు దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఐయామ్ గేమ్'. నహాస్ హిదాయత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఈ సినిమా నుంచి అభిమానుల కోసం 'లూజర్' అనే గీతాన్ని మేకర్స్ గురువారం విడుదల చేశారు. మలయాళంలో ఈ పాటను స్వయంగా దుల్కర్ సల్మాన్ ఆలపించడం విశేషం.'లూజర్' అనే పదాన్ని సాధారణంగా నెగటివ్‌గా చూస్తారు. కానీ ఈ పాటలో మాత్రం దాన్ని చాలా సరదాగా, పాజిటివ్‌గా సెలబ్రేట్ చేసుకునేలా చిత్రీకరించారు. సినిమాలోని పాత్రల స్వభావాలను, వారి అస్తవ్యస్తమైన ప్రపంచాన్ని ఈ పాట సరదాగా పరిచయం చేస్తుంది. జేక్స్ బిజోయ్ అందించిన సంగీతం, సుహైల్ కోయా సాహిత్యం పాటకు మరింత ఊపునిచ్చాయి. తెలుగులో ఈ పాటకు సనారే సాహిత్యం అందించగా, బెన్నీ దయాళ్ ఆలపించాడు. ఈ పాట గురించి దుల్కర్ మాట్లాడుతూ, "'లూజర్స్'ను సెలబ్రేట్ చేసే పాట ఇది. చాలా సరదాగా అనిపించింది. దీన్ని పాడే అవకాశం కూడా నాకు లభించింది" అని అన్నారు. సినిమాలో తన పాత్ర గురించి చెబుతూ, "ఈ చిత్రంలో నేను చాలా అల్లరిచిల్లరగా ఉండే పాత్రలో కనిపిస్తాను. ఇది నిజ జీవితంలో నాకు పూర్తి భిన్నమైనది. సినిమా చివరికల్లా నా పాత్రలో మార్పు వచ్చి, మీ అందరినీ మళ్ళీ గెలుచుకుంటానని ఆశిస్తున్నాను" అని వివరించారు.మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ఈ పాటను విడుదల చేసినట్లు దుల్కర్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. వాస్తవానికి ఈ సినిమా ఆగస్టు 20న విడుదల కావాల్సి ఉండగా, సెప్టెంబర్ 3కి వాయిదా పడింది. మరింత విస్తృతంగా, ఎక్కువ థియేటర్లలో విడుదల చేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు దుల్కర్ గతంలో ఓ ప్రకటనలో వెల్లడించారు. "గేమ్ పెద్దది అవుతోంది, విడుదల కూడా విస్తృతంగా ఉంటుంది. ఈ సినిమాను సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను దుల్కర్ సల్మాన్ తన సొంత నిర్మాణ సంస్థ వేఫేరర్ ఫిల్మ్స్‌పై జోమ్ వర్గీస్‌తో కలిసి నిర్మించారు. దాదాపు 11 నెలల పాటు 156 రోజుల షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రాన్ని దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లొకేషన్లలో చిత్రీకరించారు. ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, కయాదు లోహర్, కదిర్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటించగా, అన్బరివ్ మాస్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ అందించారు.

# అదంతా నా కష్టార్జితమే: కొమురం



కొమరక్కగా పాప్యులర్ అయిన కొమురం గురించే ఇప్పుడు అంతా మాట్లాడుకుంటున్నారు. 'ఇరుముడి' సినిమాలో ఆయన పోషించిన 'నాగులు' పాత్ర ఆడియన్స్ కి బాగా కనెక్ట్ అయింది. ఈ నేపథ్యంలో తాజాగా 'సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కొమురం తన గురించిన అనేక విషయాలను గురించి ప్రస్తావిస్తూ వెళ్లాడు. "మేము షాద్ నగర్ దగ్గరలో ఉంటాము. మా ఇల్లు .. పొలాలు అక్కడే ఉంటాయి. ఒకప్పుడు ఒక దొర ఉన్న ఇల్లునే మేము కొనుక్కున్నాము" అని చెప్పాడు. " నటుడిగా నేను జబర్దస్త్ లో పేరు తెచ్చుకున్నా .. సినిమాలు చేస్తున్నా మా అమ్మ ఇప్పటికీ కూరగాయలు అమ్ముతూనే ఉంటుంది. ఒక్కోరోజు ఒక్కో సంతలో ఆమె కూరగాయలు అమ్ముకుని వస్తుంటుంది. మా నాన్న .. మా అన్నయ్య .. నేను కూడా వ్యవసాయం చేస్తాము. మాకు ఒక 40 బర్రెలు ఉన్నాయి. నేను కూడా పాలుపితుకుతూనే ఉంటాను. కష్టపడి పనిచేయడంలో సంతృప్తి ఉంటుంది. షూటింగ్ లేకపోతే నేను మా ఊళ్లోనే ఉంటాను" అని అన్నాడు. " హైదరాబాదులో ఒక చిన్న రూములో అద్దెకి ఉంటూ వేషాల కోసం తిరిగాను. నాకు వచ్చిన కొంతమొత్తంలోనే పొలాలు కొంటూ వెళ్లాను. మాకు ఇప్పుడు 20 ఎకరాల పొలం ఉంది .. అందులో 17 ఎకరాలు నేను కొన్నదే. పొలాలు కొనాలనే ఆసక్తి నాకు మొదటి నుంచి ఉండేది. అందువలన తక్కువ రేట్లు ఉన్నప్పుడే కొనడం జరిగింది. అప్పట్లో జబర్దస్త్ చేసే వాళ్లందరికీ కూడా నేను చెప్పాను .. పొలాలు కొనమని. నా మాటను చాలామంది వినిపించుకోలేదు. ఆ తరువాత అయ్యో అంటూ బాధపడినవారు కూడా ఉన్నారు" అని చెప్పాడు.

## రకుల్ నోట శూర్పణఖ కథ..
# తెలియని విషయాలు బయటపెట్టిన నటి!



రామాయణంలో శూర్పణఖ అంటే చాలామందికి వెంటనే గుర్తుకొచ్చేది ప్రతినాయకురాలి పాత్రే. కానీ, 'రామాయణ' చిత్రంలో తాను పోషిస్తున్న శూర్పణఖ పాత్రలో అంతకుమించిన కోణాలు న్నాయని నటి రకుల్ ప్రీత్ సింగ్ చెప్పింది. ఆ పాత్రలోని అనేక అంశాలు తనను ఈ సినిమా వైపు ఆకర్షించాయని తెలిపింది. రావణుడి సోదరిగా శూర్పణఖ పాత్రలో రకుల్ కనిపించ నుంది. లంకలో అత్యంత అందమైన మహిళల్లో ఆమె ఒకరని చెబుతారని రకుల్ గుర్తు చేసుకుంది. ఆమెకు అహంకారం ఉన్నప్పటికీ.. పాత్రలో చాలా కోణాలున్నాయని చెప్పింది. నటిగా అలాంటి పాత్రలను ఆవిష్కరించడం ఆసక్తికరంగా ఉంటుందని తెలిపింది.స్క్రిప్ట్ చదివే వరకు శూర్పణఖ జీవితం గురించి తనకు తెలియని విషయాలు చాలానే ఉన్నాయని రకుల్ చెప్పింది. లక్ష్మణుడు ఆమె ముక్కు కోసిన ఘటనకు ముందు, తర్వాత జరిగిన పరిణా మాలను సినిమాలో కొత్త కోణంలో చూపి స్తున్నట్లు వెల్లడించింది. రాముడిని శూర్పణఖ ఎలా కలుస్తుందన్న విషయాల్లోనూ కొత్త అంశాలు తెలుసుకున్నానని తెలిపింది. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోంది. 'రామాయణ: పార్ట్-1' 2026 నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## శ్రీలంకతో రెండో టెస్టు డ్రా..
## టెస్ట్ క్రికెట్ గెలిచిందన్న టీమిండియా కెప్టెన్ గిల్



భారత్, శ్రీలంక మధ్య కొలంబోలో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆఖరి రోజు భారత బౌలర్లను లంక బ్యాటర్లు సమర్థంగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా, సోనల్ దినుష (133 నాటౌట్) అజేయ సెంచరీతో వీరోచితంగా పోరాడి మ్యాచ్‌ను కాపాడాడు. రెండో టెస్టు డ్రా అయినప్పటికీ, రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. క్లీన్‌స్వీప్ చేయాలన్న టీమిండియా ఆశలు నెరవేరలేదు. మ్యాచ్ అనంతరం టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. తమ వ్యూహాల్లో ఎలాంటి పొరపాటు లేదని స్పష్టం చేశాడు. "నిజాయతీగా చెప్పాలంటే, మేం చేయగలిగిందంతా చేశాం. మూడు రోజుల పాటు ఫీల్డింగ్ చేశాం. కానీ లంక బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. వారికి కొద్దిగా అదృష్టం కూడా కలిసొచ్చింది" అని గిల్ అన్నాడు. ఫాలో-ఆన్ నిర్ణయంపై మాట్లాడుతూ.. "జరిగిపోయిన తర్వాత దేని గురించైనా మాట్లాడొచ్చు. కానీ ఆ క్షణంలో ఏది ఉత్తమమనిపిస్తుందో ఆ నిర్ణయమే తీసుకుంటాం. ఈరోజు టెస్ట్ క్రికెట్ గెలిచింది" అని వ్యాఖ్యానించాడు.ఈ సిరీస్‌లో తమకు ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయని గిల్ తెలిపాడు. దేవ్‌దత్ పడిక్కల్, కేఎల్ రాహుల్, మానవ్ సుతార్ అద్భుతంగా రాణించారని ప్రశంసించాడు. ముఖ్యంగా, సిరీస్‌లో 16 వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్‌పై గిల్ ప్రశంసల వర్షం కురిపించాడు. "అతని బౌలింగ్‌లో స్థిరత్వం, బంతిని రిలీజ్ చేసే విధానం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. భవిష్యత్తులో అతను మాకు కీలక బౌలర్ కాబోతున్నాడు" అని గిల్ వివరించాడు.రాబోయే అంతర్జాతీయ మ్యాచ్‌ల గురించి మాట్లాడుతూ.. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించడమే తమ లక్ష్యమని గిల్ స్పష్టం చేశాడు. "మైదానంలోనూ, వెలుపల మా ప్రదర్శన, సన్నద్ధతలో స్థిరత్వం చాలా ముఖ్యం. త్వరలో న్యూజిలాండ్ పర్యటనకు వెళుతున్నాం. ఆ తర్వాత స్వదేశంలో మంచి సిరీస్‌లు ఉన్నాయి. మాపై మాకు నమ్మకం ఉంది, కచ్చితంగా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుకుంటాం" అని ధీమా వ్యక్తం చేశాడు.



## న్యూజిలాండ్ టీమిండియా పర్యటనకు భారీ క్రేజ్..
## 48 గంటల్లోనే 26 వేల టికెట్ల అమ్మకం

టీమిండియా న్యూజిలాండ్ పర్యటనకు ఇప్పటి నుంచే భారీ క్రేజ్ కనిపిస్తోంది. న్యూజిలాండ్ క్రికెట్ అంతర్జాతీయ సీజన్ టికెట్ విక్రయాలు రికార్డు స్థాయిలో ప్రారంభమయ్యాయి. క్రికెట్ నేషన్ సభ్యుల ప్రీ-సేల్ మొదలైన 48 గంటల్లోనే 26 వేల టికెట్లు అమ్ముడయ్యాయి.భారత్ అక్టోబర్‌లో న్యూజిలాండ్‌లో పర్యటించనుంది. 12 మ్యాచ్‌ల సుదీర్ఘ మల్టీ-ఫార్మాట్ సిరీస్‌లో భాగంగా టీ20లు, వన్డేలు, టెస్టులు జరగనున్నాయి. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో జరిగే పరిమిత ఓవర్ల మ్యాచ్‌లకు టికెట్లకు భారీ డిమాండ్ ఏర్పడింది.క్రైస్ట్‌చర్చ్‌లోని 9 వేల సీట్ల హాగ్లీ ఓవల్‌కు కూడా టికెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అక్టోబర్ 22, 24 తేదీల్లో జరిగే తొలి రెండు టీ20లకు ఈ స్టేడియం పూర్తిగా నిండిపోయే అవకాశం ఉంది. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు జరిగే రెండో టెస్టుకు కూడా భారీ స్పందన వస్తోంది.వెల్లింగ్టన్‌లోనూ టికెట్లకు డిమాండ్ పెరిగింది. హెచ్ఎన్ఆర్‌వై స్టేడియంలో మూడో టీ20, రెండో వన్డే జరగనున్నాయి. తొలి టెస్టు నవంబర్ 19న బేసిన్ రిజర్వ్‌లో ప్రారంభమవుతుంది. భారత పర్యటనపై అభిమానుల్లో ఉన్న ఉత్సాహమే రికార్డు విక్రయాలకు కారణమని న్యూజిలాండ్ క్రికెట్ చీఫ్ మార్కెటింగ్ అండ్ కమర్షియల్ ఆఫీసర్ గ్లెన్ క్రిట్చ్‌లీ తెలిపారు. గత సీజన్‌లో ఉన్న ధరలనే కొనసాగించామని చెప్పారు. క్రికెట్ నేషన్ కోడ్‌తో ఒక్కో టికెట్ ధర 30 న్యూజిలాండ్ డాలర్లలోపే ఉంటుందని వెల్లడించారు.సెప్టెంబర్ 7 నుంచి సాధారణ టికెట్ విక్రయాలు ప్రారంభమవుతాయి. క్రికెట్ నేషన్‌లో సభ్యత్వం తీసుకున్న అభిమానులు ముందస్తు విక్రయాల్లో పాల్గొనవచ్చు. వారికి టికెట్లపై 15 శాతం రాయితీ లభిస్తుంది. పలు మ్యాచ్‌లకు హాజరయ్యేవారి కోసం 'ది ఫోర్', 'ది సిక్స్' గ్రూప్ టికెట్ ప్యాకేజీలను కూడా అందుబాటులో ఉంచారు.

# కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధిని వెంటనే అమలు చేయాలి

**- రాయచోటి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆర్. అమీర్ బాష డిమాండ్**



**రాయచోటి - సూర్య వాస్తవం :** ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు అందించే నెలకు రూ. 1500 ఆడబిడ్డ నిధి' పథకం అమలు ఎప్పుడో.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తేదీని ప్రకటించాలని రాయచోటి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆర్. అమీర్ బాష డిమాండ్ చేశారు. గురువారం తమ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ... సూపర్ సిక్స్ లో భాగంగా 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి మహిళకు నెలనెలా రూ. 1,500/- ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో మహిళలకు హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు మరిచిపోయారని ఆయన గుర్తు చేశారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి కొన్ని సూపర్ సిక్స్ హామీలను అమలు చేసిన ప్రభుత్వం, ఈ ఆడబిడ్డ నిధి మరియు నిరుద్యోగ భృతి పథకాలనుమరిచిపోయారని అన్నారు. ఆడబిడ్డ నిధి ఎప్పుడు అమలు అవుతుందా అంటూ రాష్ట్ర మహిళలు కళ్ళు కాయలు కాసేలాఎదురుచూస్తున్నారని రెండు సంవత్సరాలుగా ఈ పథకం అమలుపై పాలకులు మేనమేషాలు వేస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ మహిళల ఆవేదన అర్థం చేసుకుని 'ఆడ బిడ్డ'నిది పథకం పట్ల కూటమి ప్రభుత్వం తగు శ్రద్ధ వహించి వెంటనే పథకం అమలు చేసి అర్హులైన మహిళల ఖాతాల్లో రూ.1500 జమ చేయాలి. లేదా ఆడబిడ్డ నిధి అమలు తేదీని ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ షేక్ అమీర్ బాష, పట్టణ అధ్యక్షుడు సర్దార్, మస్తాన్, పట్టణ మహిళా అధ్యక్షురాలు స్వనజా రెడ్డి, బసమ్మలు పాల్గొన్నారు.

# మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన పార్టీ శ్రేణులు



**రాయచోటి-సూర్య వాస్తవం:** రాష్ట్ర రవాణా,యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని రాయచోటి నియోజకవర్గం జనసేన పార్టీ శ్రేణులు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్, దర్బార్ భాష, యహీయా భాష లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, బొకే ఇచ్చి ఘనంగా సన్మానించారు. గురువారం వారు స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన్ను కలిసి నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇది కూటమి ప్రభుత్వం అందరూ కలిసిమెలిసి అభివృద్ధి కోసం కృషి చేయాలని, ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ ద్వారా పలు పథకాలు లబ్ధి పొందాలి

**- రైతు విశిష్ట సంఖ్య ఐడి ప్రతి రైతుకు తప్పనిసరి**
**- మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి**



**ముద్దనూరు - సూర్య వాస్తవం:** మండలంలోని రైతు సోదరులకు తెలియ చేయడం ఏమనగా పొలం కలిగి ఉన్న రైతు సోదరులు తప్పనిసరిగా ఏపీ యఫ్ ఆర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని (ఫార్మర్ ఐడి) రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 7389 మంది రైతులు పొలం కలిగి పియం కిసాన్ పథకం లబ్ధి పొందుతున్నారని ఇందులో ఇప్పటివరకు 6442 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఫార్మర్ ఐడి పొంది ఉన్నారని తెలిపారు. ఇంకా మండలంలో 947 మంది రైతులు వివిధ కారణాలతో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా పెండింగ్ లో ఉన్నారని తెలిపారు. కావున ఫార్మర్ ఐడి లేని రైతులు వెంటనే సంబంధించిన రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి మొబైల్ ఓటిపి ద్వారా గాని లేదా ప్రత్యక్షంగా గాని,పరోక్షంగా గాని లేదా స్వయంగా ఏపీఎయిమ్స్ యాప్ ద్వారా గాని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అన్నారు. ఫార్మర్ ఐడి లేకపోతే వ్యవసాయ శాఖ ద్వారా అమలుచేసే ఏ పథకం వర్తించదు అన్నారు. భవిష్యత్తు లో పంట నమోదు,పంటల బీమా,ఎరువులు, విత్తనాలు, రాయితీ పనిముట్లు,పియం,కిసాన్ పథకం,అన్నదాత సుఖీభవ పథకం,కొనుగోలు కేంద్రాల ద్వారా పంటల మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవాలి అన్న ఫార్మర్ ఐడి తప్పనిసరిగా ఉండాలి అన్నారు. ఫార్మర్ ఐడి అన్ని పథకాలకు శ్రీరామ రక్ష వంటిది అన్నారు. ఇప్పటివరకు మండలంలో ఫార్మర్ ఐడి 87.16శాతం మంది రైతులకు పూర్తి చేయడం జరిగింది అన్నారు. కావున మండలంలో 947 మంది పెండింగ్ ఉన్న రైతులు ఆలస్యం చేయకుండా రిజిస్ట్రేషన్ చేసుకుని ఫార్మర్ ఐడి పొంది పలు వ్యవసాయ శాఖ పథకాలను లబ్ధి పొందాలి అని మండల వ్యవసాయ అధికారి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం

**- మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్**



**జమ్మలమడుగు - సూర్య వాస్తవం :** స్థానిక గూడు మస్తాన్ వలీ దర్గా దగ్గర కర్మలవారిపల్లె సర్పంచ్ పుల్లారెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ టౌన్ ప్రసిడెంట్ అహమ్మద్ హుస్సేన్ కి ఫోన్ ద్వారా సంప్రదించగా వారు ఫుడ్ డొనేషన్ తమ వంతుగా ఆకలితో ఉన్న వారికి అన్నం పంచారు. మన దగ్గర ఉన్నదాంట్లో కొంత భాగాన్ని అవసరమైన వారికి పంచుకోవడం ఎంతో గొప్ప సేవ అని మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఫౌండర్ మోరే లక్ష్మణ్ రావు అన్నారు. ఒక పూట భోజనం ఎవరి ఆకలినైనా తీర్చడమే కాక, వారి ముఖంలో చిరునవ్వును తీసుకురాగలదు. సహాయం అంటే కేవలం డబ్బులు లేదా వస్తువులు ఇవ్వడమే కాదు ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం కూడా గొప్ప మానవత్వం. మనకు సాధ్యమైనంత వరకు అవసరమైన వారికి సహాయం చేస్తూ, ప్రేమ, దయ, మానవత్వం మరియు సేవాభావాన్ని పంచుకుందాం. మన చిన్న సహాయం కూడా మరొకరి జీవితంలో పెద్ద ఆనందాన్ని నింపగలదని వివరించారు. ఈ అన్నదాన కార్యక్రమం లో ఫౌండేషన్ సభ్యులు మోరే లక్ష్మణ్ రావు, అహమ్మద్ హుస్సేన్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు

# పరిష్కారమయ్యేవరకు పోరాడుతాం

**- అవసరమైతే నిరాహారదీక్షకు సిద్ధం**
**- ప్రొద్దటూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫామ్ బాషా భరోసా**




**ప్రొద్దుటూరు- సూర్య వాస్తవం :** ప్రొద్దుటూరు స్వశక్తి భవన్లో ఎస్టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సీహెచ్ శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధిల్ల సుబ్బరాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను ఇర్ఫాన్ బాషా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ, 2018లో 11వ పిఆర్సీ తర్వాత దాదాపు ఎనిమిదేళ్లు గడిచినా 12వ పిఆర్సీ ఏర్పాటు చేయకపోవడం, ఐదు డిఎలు పెండింగ్లో ఉంచడం ఉద్యోగులకు తీవ్ర అన్యాయమని అన్నారు. ఈ కాలంలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయిందని తెలిపారు నిత్యావసర సరుకులు, పెట్రోల్, ప్రయాణ ఖర్చులు తదితరాల ధరలు భారీగా పెరిగినా జీతాల్లో తగిన మార్పు లేకపోవడం దారుణమన్నారు. 15--20 ఏళ్లుగా బోధిస్తున్న ఉపాధ్యాయులను మళ్లీ టెట్ పరీక్ష రాసి తమ అర్హతను నిరూపించుకోమనడం ఎంతవరకు సమంజస అని ప్రశ్నించారు. ఒక పరీక్ష పాస్ కావచ్చు.. కానీ 15 ఏళ్ల 20 ఏళ్ల అనుభవాన్ని ఏ పరీక్షా భర్తీ చేయలేదు" అని అన్నారు. కుటుంబ, పిల్లల చదువులు, ఇతర బాధ్యతలు, వయస్సు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని 2010కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డీఏలను సకాలంలో అందించడంతో పాటు, పెండింగ్లో ఉన్న డీఏలను కూడా వెంటనే చెల్లించాలని ఇర్ఫాన్ బాషా డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను ఎపిసిసి అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలా రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి లేఖ, ప్రాతినిధ్యం అందిస్తానని తెలిపారు. అవసరమైతే కేంద్ర స్థాయిలో సమస్యను వినిపించడంతో పాటు, న్యాయపరమైన పోరాటానికి కూడా సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారికి అండగా ఉంటాను. అవసరమైతే నిరాహార దీక్షకు కూడా సిద్ధం అని ఇర్ఫాన్ బాషా భరోసా ఇచ్చారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని గురువారం రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ , మాచర్ల టౌన్ టిడిపి అధ్యక్షుడు కొమెర దుర్గారావు దర్శించు కున్నారు. వీరికి మఠం యాజమాన్యం ప్రత్యేక స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఘనంగా సన్మానించారు. స్థానిక మండల బీసీ చైతన్య సమితి కోశాధికారి రెడ్ల దిన్నె ఖాదరయ్య తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త దగ్గరుండి వారికి ప్రత్యేక ఏర్పాట్లు ఏర్పాటు చేశారు. వీరి వెంట స్నేహితులు తెలుగుదేశం నాయకులు ఉన్నారు.

# ఘనంగా వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు




**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** కడప పార్లమెంట్ సభ్యులు, జిల్లా ముద్దుబిడ్డ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను బ్రహ్మంగారిమఠంలో ఘనంగా నిర్వహించారు. మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి ఆదేశాల మేరకు మండల ఉపాధ్యక్షుడు ఎత్తపు సుబ్బారెడ్డి, మైదుకూరు నియోజకవర్గానికి చెందిన భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు వైఎస్ అవినాష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో భూమిరెడ్డి శివనారాయణరెడ్డి, చెంచయ్యగారిపల్లె రామ్మోహన్‌రెడ్డి, సిద్ధు, రమణారెడ్డి, బద్దెల శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎత్తపు సుదర్శన్‌రెడ్డి, ఉత్పత్తి గోపాల్‌రెడ్డి, ఉత్పత్తి సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, నరసింహారెడ్డి, సోమిరెడ్డిపల్లె బీఎల్ఓ సుబ్బారెడ్డి, లక్ష్మీరెడ్డి, వనిపెంట రామ్మోహన్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ పంచాయతీ యువజన అధ్యక్షుడు), పెసల రవిశంకర్‌రెడ్డి (పంచాయతీ జనరల్ సెక్రటరీ), రమా సీను, రమణయ్య, ప్రభాస్, చెన్నకేశవరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, కల్లూరి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

**- ట్రాఫిక్ రూల్స్ పాటించాలి**

**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం :** ప్రొద్దుటూరు పట్టణంలోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ భాస్కర్ విద్యార్థులతో పరస్పరం మాట్లాడి ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రాముఖ్యతను వివరించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన, విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, తమ కుటుంబ సభ్యులు మరియు స్నేహితులు కూడా రోడ్డు భద్రతా నియమాలను పాటించేలా అవగాహన కలిగి వుండాలని తెలిపారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : H/No C/ 33 Near Ring road Cattamanchi school opposite Kurnool ANDHRAPRADESH-518001,CELL : : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )